

20 మందికి రాష్ట్రస్థాయి 'ఉత్తమ' ఉపాధ్యాయ అవార్డులు

జిల్లాలో 20 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపికయ్యారు. బోధన, పరిశోధన రంగాల్లో వీరు చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. శుక్రవారం అమరావతిలో జరగనున్న గురుపూజోత్సవంలో వీరు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు. - శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



విద్యావిధానంపై పరిశోధన

పొన్నంరెడ్డి కుమారి నీరజ.. శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలు. విద్యావిధానంపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పరిశోధనలు చేశారు. విద్యార్థులకు అర్థవంతమైన బోధనతో పాటు పరిశోధనలపై ఆసక్తి కల్పిస్తున్నారామె.



క్రమశిక్షణాపథం

గంగారామ్.. శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ లెక్చరర్. తన బోధనతో విద్యార్థులను ప్రభావితం చూస్తూ ఉత్తమ పథంలో నడిపిస్తున్నారు. ఆర్థిక, వ్యక్తిగత క్రమశిక్షణను నేర్పిస్తున్నారు.



ఆయన ఓ ఇన్‌స్పైర్

సుబ్రహ్మణ్యం శర్మ.. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచరు. బోధనతో పాటు ప్రయోగాలు చేయిస్తూ విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ప్రదర్శనల విషయంలో చొరవ చూపి విద్యార్థులను తీసుకెళ్లారు.



క్రీడాసక్తికి పునాది

రామకృష్ణ.. శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి ప్రభుత్వ పాఠశాలలో పీడీ. స్వస్థలం అనకాపల్లి జిల్లా నాతవరం. పుష్కరకాలంగా అమ్మ ఎడ్యుకేషన్‌ఫౌండేషన్ సంస్థ ద్వారా ఎందరో విద్యార్థులకు సొంత నిధులు వెచ్చించి క్రీడలపై ఆసక్తి పెంచారు. పేద విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. అత్యవసరమైతే విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నారు.

బాధ్యతలు 'గురు'తరం 6

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎస్వీ కుమార్

పుత్తూరు, ఆంధ్రజ్యోతి: పుత్తూరు మండలం పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు చెందిన ఎస్వీ కుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. 1992లో లెక్చరర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ఈయన తాను పనిచేసిన కళాశాలల్లో పలు కంపెనీలతో మాట్లాడి జాబ్ మేళాలను నిర్వహించారు.



అర్థమయ్యే రీతిలో బోధన

చంద్రగిరి, ఆంధ్రజ్యోతి: చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడు చీర్ల వెంకటరమణ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. అర్థమయ్యే రీతిలో బోధించడంలో ఈయన గుర్తింపు పొందారు.



సులభ బోధనకు పెట్టింది పేరు

బాలసుబ్రహ్మణ్యం.. తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెం ప్రభుత్వ పాఠశాలలో టీచరు. తెలుగులో పలు రచనలు సాగించడంతో పాటు మిమిక్రీ ఆర్టిస్టుగా గుర్తింపు పొందారు. అట్టముక్కలు, వివిధ సులభమైన మార్గాల ద్వారా పిల్లలకు విద్యాబోధన చేస్తూ మేధస్సుకు పదును పెడుతుంటారు. ఆయన రచించిన సీతాకోకచిలు పద్యాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఒకటో తరగతి తెలుగు పుస్తకంలో పాఠ్యాంశంగా ప్రచురించింది.



తిరుపతిలో నేడు గురుపూజోత్సవం

- 68 మందికి జిల్లా ఉత్తమ పురస్కారాల ప్రదానం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కచ్చపి స్టేడియంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు గురుపూజోత్సవం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62 మందికి.. ఆరుగురు ఎంఈవోలకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కమిషనర్ తదితర అధికారులు, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.






టి.రమాశ్రీ - ఎం.బాలాజీ - పి.అఖిల స్వతంత్ర - టి.విజయ






వి.సుబ్బారావు - టి.చంద్రశేఖరయ్య - రమ్యాకుబేర్ - ఎం.అరుణ






పి.జ్యోత్స్న - వైఎస్ శారద - వెంకటకృష్ణ - సి.భువనేశ్వరిదేవి

13 మంది వర్సిటీ అధ్యాపకులకూ..



డి.సుబ్రమణ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):బోధన, పరిశోధన, విస్తరణ, సేవ తదితర రంగాల్లో కృషికి గుర్తింపుగా తిరుపతిలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో 13 మంది ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు.

ఎస్వీ యూనివర్సిటీ: ప్రొఫెసర్లు టి.రమాశ్రీ (ఈసీఈ), ఎం.బాలాజీ (బయోకెమిస్ట్రీ), అఖిల స్వతంత్ర (మెకానికల్ ఇంజినీరింగ్), టి.విజయ (బోటనీ), టి.చంద్రశేఖరయ్య (పాపులేషన్ స్టడీస్), డి.సుబ్బారావు (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్)

పద్మావతి యూనివర్సిటీ: ప్రొఫెసర్లు వైఎస్ శారద (ఇంగ్లీషు), ఎం.అరుణ (హోంసైన్స్), పెంచలనేని జ్యోత్స్న (బయో టెక్నాలజీ), పి.వెంకటకృష్ణ (కంప్యూటర్‌సైన్స్), రమ్యాకుబేర్ (ఫార్మసీ), పద్మావతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరిదేవి (జువాలజీ)తో పాటు ఎస్వీ వ్యవసాయ కాలేజీలో డాక్టర్ డి. సుబ్రమణ్యం (అగ్రానమీ) కూడా పురస్కారానికి ఎంపికయ్యారు.

శెట్టిపల్లె ఫైల్స్ క్లియర్!

ఇక, శెట్టిపల్లె భూ సమస్య కనిపించదు. బాధితుల గోడు అసలు వినిపించదు. దశాబ్దాల వివాదానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. శాశ్వత పరిష్కారం చూపుతూ సీఎం నారా చంద్రబాబు నేతృత్వంలో గురువారం జరిగిన కేబినెట్ నిర్ణయం తీసుకుంది. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

స్థలాల యజమానులకు కనీసం 2 సెంట్ల కేటాయింపు

మంత్రివర్గ భేటీలో నిర్ణయం

దశాబ్దాల వివాదానికి చెక్ పెట్టిన ప్రభుత్వం

తిరుపతి నగరపరిధిలోని శెట్టిపల్లెలో సర్వే లెక్కల ప్రకారం దాదాపు 636 ఎకరాలున్నాయి. దాదాపు 500 కుటుంబాలు వ్యవసాయాన్నే జీవనాధారంగా నమ్ముకుని జీవించేవారు. 3-5-1979లో ఇనామ్ చట్టం రద్దయింది. అదే ఏడాది జూన్ 25న శెట్టిపల్లె గ్రామం ఏర్పాటైంది. 1980-81 మధ్య కాలంలో సాగుబడిని అనుభవంగా పరిగణనలోకి తీసుకున్న అప్పటి కలెక్టర్.. అనుభవంలో ఉన్నవారి భూములను గుర్తించి, గట్టువారి సర్వే నిర్వహించి రఫ్ పట్టాలను మంజూరు చేశారు. రఫ్ పట్టాల ఆధారంగానే భూమి హక్కుదారులుగా ఉండేవారు. క్రయవిక్రయాలు కూడా పెద్దఎత్తున జరిగాయి. ఈ నేపథ్యంలోనే 82.67 ఎకరాలను రైల్వే శాఖ తిరుపతి సీఆర్ఎస్ కోసం భూములు తీసుకుని పరిహారం చెల్లించింది. భూములు కోల్పోయిన ప్రతి ఇంటికి సీఆర్ఎస్‌లో ఓ ఉద్యోగాన్ని కల్పించింది. నగరానికి దగ్గరగా ఉండడంతో రఫ్ పట్టాలతో క్రయవిక్రయాలు జరగ్గా.. ఒకే ప్లాట్‌ను ఇద్దరు, ముగ్గురుకు కూడా విక్రయించినట్టు వెలుగులోకి వచ్చింది. ఈవివాదానికి బ్రేక్ వేస్తూ 2015లో సీఎం చంద్రబాబు నాయుడు శెట్టిపల్లె భూములను 22ఏలో చేర్చారు. దీంతో రిజిస్ట్రేషన్ జరగకుండా అడ్డుకోగలిగారు.

వైసీపీ పొలిటికల్ గేమ్

భూములు తమ అనుభవంలో ఉన్నా, అక్కరకు అమ్ముకోవాలన్నా కుదరదు. ఎవరు ఆక్రమిస్తారోనన్న ఆందోళన. నిజమైన హక్కుదారులే శెట్టిపల్లె భూముల్లో బాధితులయ్యారు. రెండు నియోజకవర్గాలతో ముడిపడిన ఆ ప్రాంతంపై వైసీపీ పెద్దల కన్ను పడింది. మేం చేస్తాం...మేమే చేశాం...అంటూ ఎవరికివారు మభ్యపెట్టారు. ఖాళీ ప్రొసీడింగ్స్ కాపీలు చేతిలోపెట్టి సమస్యను సెటిల్ చేసేశామంటూ చెప్పారు. హక్కుదారులు స్థలాల దగ్గరకు వెళితే రెవెన్యూ వాళ్లు అడ్డుకుని వెనక్కి పంపేశారు. ఇలా వీరితో వైసీపీ పొలిటికల్ గేమ్ ఆడింది.

క్లియర్ చేసిన కూటమి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం శెట్టిపల్లి భూముల సమస్యను కొలిక్కి తెచ్చింది. స్థలాల యజమానులకు కనీసం 2 సెంట్ల చొప్పున కేటాయించేందుకు గురువారం నాటి మంత్రిమండలిలో అంగీకరించింది. 2400 మంది యజమానుల్లో 1700 మందికి పైగా యజమానులకు 4 సెంట్లలోపే స్థలాలున్నాయి. వారికి ల్యాండ్ పూలింగ్‌లో ఒకటన్నర సెంటు కంటే తక్కువ స్థలాలు దక్కనున్నాయి. దీంతో రెవిన్యూ శాఖ చేసిన ప్రతిపాదన మేరకు మంత్రి మండలి కనీస స్థలం 2 సెంట్లు చొప్పున ఇచ్చేందుకు అంగీకరించింది. దానివల్ల 1700 కుటుంబాలకు లబ్ధి కలగనుంది.

చంద్రబాబు విజన్‌తో మహర్దశ

చంద్రబాబు విజన్‌తో శెట్టిపల్లెకు మహర్దశ రానుంది. వెడ్డింగ్ డెస్టినేషన్, స్టార్ హోటల్స్ ఏర్పాటుచేసే ఆలోచనలు యంత్రాంగం ఉన్నట్టు తెలుస్తోంది. కేబినెట్ నిర్ణయం మేరకు 227 ఎకరాల్లో టౌన్‌షిప్ వేస్తారు. ఇందులో దాదాపు 2500 మంది బాధితులకు (ప్లాట్ ఓనర్లకు 50:50, అగ్రికల్చర్ 30:70 చొప్పున) ప్లాట్లు కేటాయిస్తారు. 65 ఎకరాలు తుడాకు, 90 ఎకరాలు ప్రభుత్వం ఉంచుకుంటుంది. తుడాకు కేటాయించే 65 ఎకరాలు ఎంఐజీ లేఅవుట్‌లు వేసి విక్రయించగా వచ్చిన ఆదాయంతో టౌన్‌షిప్ రూపొందిస్తుంది. ప్రభుత్వం వద్ద ఉండే భూములను భవిష్యత్ అవసరాలతో పాటు వెడ్డింగ్ డెస్టినేషన్ సెంటర్‌గా మార్చనుంది.

మీకు రుణపడి ఉంటాం

- కలెక్టర్‌కు శెట్టిపల్లె భూబాధితుల కృతజ్ఞతలు.. సన్మానం



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి భూ సమస్యకు పరిష్కారం చూపారని, రుణపడి ఉంటామని భూబాధితుల కమిటీ గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. మంత్రి వర్గ నిర్ణయం తెలిసిన వెంటనే వీరు కలెక్టర్‌ను కలిశారు. మీ కృషి ఫలితంగానే మాకు న్యాయం జరిగిందంటూ సంతోషం వ్యక్తంచేశారు. మాటిచ్చి నెరవేర్చినందుకు సంతృప్తిగా ఉందని, రెండు నెలల్లో పూర్తిగా సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి చెప్పారు. కమిటీ అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణ, శ్రీనివాసులు, రాజేంద్ర, సురేష్, జ్యోతిరెడ్డి, నాదముని, చిరంజీవి, బుజ్జి పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

తాము అధికారంలోకి వస్తే శెట్టిపల్లె భూ సమస్యను సెటిల్ చేస్తామని ఎన్నికలముందు హామీ ఇచ్చాం. ఆమేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాం. ఎట్టకేలకు సమస్యను సుఖాంతం చేయగలిగాం.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే, తిరుపతి

అందరికీ 2సెంట్లు ఇచ్చేలా సీఎం నిర్ణయం

కేబినెట్ అజెండాలో తొలుత శెట్టిపల్లి కనిపించలేదు. సీఎం చంద్రబాబుగారికి వివరించి అడిషనల్ అజెండాలో చేర్చాం. హౌస్‌ఫర్‌ఆల్ స్కీం కింద 2సెంట్లు ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.దీనివల్ల తుడా 7ఎకరాలు నష్టపోయినా, బాధితులు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

- డాలర్స్ దివాకర్ రెడ్డి, తుడా ఛైర్మన్

నాయుడుపేటలో సిర్మా టెక్నాలజీస్‌కు 26 ఎకరాలు

- ఏరో స్పేస్ సిటీలో స్కైరూట్ పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం
- మంత్రిమండలి సమావేశంలో నిర్ణయాలు

తిరుపతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో సిర్మా టెక్నాలజీస్ పరిశ్రమ ఏర్పాటుకు 26.70 ఎకరాల భూమి కేటాయింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఆమోదించింది. రూ.1595 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు చేసి 2168 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఈ సంస్థ ప్రతిపాదించింది. పరిశ్రమతో పాటు జాయింట్ వెంచర్ల కింద ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు ప్లాంట్, కాపర్ క్లాడ్ లామినేట్ ప్లాంట్, ఈఎంఎస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించగా, 26.70 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

- ఏరో స్పేస్ సిటీ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. ఈ స్పేస్ సిటీలో పెట్టుబడులు పెట్టడానికి మెస్సర్స్ స్కై రూట్ ఏరో స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. ఎస్ఐపీబీ సిఫారసులకు అనుగుణంగా పరిశ్రమల శాఖ చేసిన ప్రతిపాదన మేరకు స్కైరూట్ సంస్థకు ఎకరా రూ.5 లక్షల వంతున భూములు కేటాయించేందుకు మంత్రి మండలి పచ్చజెండా ఊపింది. స్పేస్ సిటీలో ప్రభుత్వం ఎర్త్ పోర్టబుల్ ఇంజన్ టెస్టు ఫెసిలిటీ, క్రయోజనిక్ ఇంజన్ టెస్టు ఫెసిలిటీ, అదే ఫెసిలిటీ 2వ యూనిట్ వంటి సదుపాయాలను కల్పించనుంది.
- దీర్ఘకాలంగా ఉన్న శెట్టిపల్లె సమస్యకు పరిష్కారం చూపింది.
- తిరుపతి సహా 16 జిల్లాల్లో దీపం-2 పథకం కింద 5 కిలోల సిలిండర్లు తీసుకున్న వారికి కూడా 14.2 కిలోల కేటగిరీలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు దక్కేలా మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. దీనివల్ల జిల్లాలో కనీసం 2 వేల కుటుంబాలకు మేలు జరగనుంది.

ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో ఎస్వీయూ, పద్మావతి మహిళా యూనివర్సిటీకి ర్యాంకులు దక్కాయి. ఎస్వీయూకు 47వ ర్యాంకు, పద్మావతి మహిళా యూనివర్సిటీకి 60వ ర్యాంకు దక్కింది. బోధన, పరిశోధన, విస్తరణ తదితర రంగాల్లో ఈ వర్సిటీల విశేష కృషికి గుర్తింపుగా ఈ ర్యాంకులు ప్రకటించారు. ర్యాంకు రావడం పట్ల ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని హర్షం వ్యక్తం చేశారు.

తుడా ప్లాట్ల వేలం ప్రారంభం

తిరుపతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) సుమారు 145 ఎకరాల్లో సూరప్పకశం వద్ద వేసిన పద్మావతి నగర్‌లోని 277 ప్లాట్లు ఈ-వేలం ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో గురువారం నుంచి 13వ విడత వేలం ప్రారంభమైంది. తుడా వారి కనీస ధర చదరపు గజం రూ.14వేలుగా నిర్ణయించారు. తొలిరోజు అనూహ్య స్పందన లభించింది. తొలిరోజు ఎల్ఐజీ 9 ప్లాట్లు, హెచ్ఐజీ 3 ప్లాట్లు అమ్ముడుపోయాయి. ఈ-వేలం ప్రక్రియను ఈనెల 17వ తేదీ వరకు నిర్వహిస్తామని తుడా కార్యదర్శి డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్ బాబు తెలిపారు. భూసేకరణ అధికారి ఎస్.సుజన, ఐసీసీఐ బ్యాంకు ప్రతినిధి ప్రవీణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేలం ప్రక్రియను కార్యదర్శి పర్యవేక్షించారు. ఈ-వేలంలో పాల్గొనదలచిన వారు వెయ్యి రూపాయలు కట్టి ఆన్లైన్‌లో ఈనెల 16వ తేదీ లోపు ఎప్పుడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు

రేణిగుంట సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావుకు జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి గురువారం షోకాజు నోటీసులు జారీ చేశారు. గుత్తివారిపల్లిలో తాగునీరు కాలుష్యం కావడంతో అతిసారం బారిన పడి ఓ వృద్ధురాలు మృతిచెందగా మరికొందరు ఆస్పత్రిపాలయ్యారు. దీనిపై వారం రోజుల్లో జవాబు ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేశారు.

అటు తనిఖీలు.. ఇటు విచారణ



- రెండో రోజు చెవిరెడ్డి ఇంట్లో సిట్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒక బృందం తనిఖీలు చేపట్టింది. మరో బృందం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని విచారించింది. ఇలా తిరుపతి విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో 15 మందితో కూడిన సిట్, విజిలెన్స్ అధికారులు రెండు బృందాలుగా విడిపోయారు. రెండో రోజైన గురువారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇంట్లో ముమ్మరంగా సోదాలు జరిపారు. మద్యం కుంభకోణం కేసులో ఏ38గా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇప్పటికే అరెస్టయ్యారు. బుధవారం ఆయనకు సంబంధించి రియల్ ఎస్టేట్ కార్యాలయంలో తనిఖీ చేయగా, అప్పటికే ఖాళీ చేసినట్లు గుర్తించారు. చెవిరెడ్డి కుటుంబీకులు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఇంట్లో.. ఇంట్లోనే నిర్వహిస్తున్న కార్యాలయంలో తనిఖీలు చేయలేదు. గురువారం వేకువజామున చెవిరెడ్డి సతీమణి లక్ష్మి, కుమారుడు మోహిత్‌కుమార్ ఇంటికి వచ్చారు. ఉదయం పది గంటలకు సిట్, విజిలెన్సు అధికారులు చెవిరెడ్డి ఇంటికి చేరుకోగా.. రాత్రి 8.30 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. వీరిలో ఇద్దరు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది ఉన్నారు. చెవిరెడ్డి కుటుంబానికి చెందిన వివిధ కంపెనీలు, సంస్థల లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, డాక్యుమెంట్లను ఒక బృందం పరిశీలించింది. రెండు కంప్యూటర్ హార్డు డిస్కులను, ఇంట్లోని సీసీ కెమెరాల హార్డు డిస్కులను, పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో మరో బృందం లిక్కర్ స్కామ్‌లో ఏ39గా ఉన్న మోహిత్‌రెడ్డిని విచారించింది. తమ వద్దనున్న సమాచారం ఆధారంగా ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఇన్‌ఫ్రా, భీమ్ స్పేసస్ ఎల్ఎల్ఎల్‌పీ, సీఎంఆర్, క్యాంపు మ్యాన్ పవర్ సర్వీసస్, సీఎంఆర్ గార్డెన్స్, మ్యాచ్ కార్న్ టెక్నాలజీస్.. తదితర సంస్థలు ఎవరి పేర్లతో ఉన్నాయి? వాటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సమర్పించాలని మోహిత్‌ను అడిగినట్లు తెలిసింది. కాగా, సిట్ అధికారుల విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలు బయటకు వచ్చినట్లు తెలిసింది. దాదాపు ఐదారు సంస్థలకు సంబంధించి లేని సంస్థల పేర్లతో బయట బోర్డులు పెట్టినట్లు విచారణలో గుర్తించారని సమాచారం.

తుడా, కానుకల మాటేమిటి?

తుడా ఛైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర రెడ్డి, మీరు (మోహిత్ రెడ్డి) ఉన్నప్పుడు సీఎంఆర్ సంస్థ పేరుతో ఎన్ని.. ఎలాంటి అభివృద్ధి పనులు చేశారు? పండగల సమయంలో పంపిణీ చేసిన కానుకలకు డబ్బులు ఎక్కడ నుంచి తెచ్చారు? సొంత రియల్ ఎస్టేట్ కంపెనీల వ్యవహార లావాదేవీలు, వాటి ఆదాయ వనరులు, ఎంతమంది భాగస్వాములున్నారు? వారెవరు? ఆయా సంస్థల్లో మీరు పెట్టిన పెట్టుబడికి నగదు ఎక్కడ నుంచి తెచ్చారు? వాటి ఆధారాలు ఉన్నాయా? ఉంటే డాక్యుమెంట్లు సమర్పించాలని విచారణాధికారులు చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, సిట్ తనిఖీల నేపథ్యంలో చెవిరెడ్డి ఇంటి వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది. వైసీపీ నాయకులు, ఆయన అనుచరులు బయట పడిగాపులు కాశారు. చెవిరెడ్డి ఇంటి వద్ద తిరుపతి రూరల్ పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరినీ అక్కడ ఉంచకుండా పంపించేశారు.

ఆరు కంపెనీల అడ్రస్‌లు తీసుకున్నాం: విజిలెన్సు ఎస్పీ



తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి: ఈ సోదాల సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివాసంలో ఆరుకంపెనీలకి సంబంధించి వివరాలు, అడ్రస్‌లు తీసుకున్నామని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ గురువారం రాత్రి మీడియాకు చెప్పారు. కొన్ని రికార్డులు సేకరించామని, వీటిని తదుపరి విచారణ కోసం సిట్‌కి అందిస్తామన్నారు.

విచారణకు సహకరించాం

సిట్ అధికారుల విచారణకు పూర్తిగా సహకరించామని మోహిత్‌రెడ్డి తెలిపారు. వారు అడిగిన అన్ని డాక్యుమెంట్లు ఇచ్చామన్నారు. ఏ తప్పు చేయలేదు కాబట్టి.. ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామన్నారు.

చంద్రగిరి

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



నిమజ్జన దీపారాధనలో పాల్గొన్న మహిళలు

చంద్రగిరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలో గురువారం సాయంత్రం వినాయక నిమజ్జన కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది. గ్రామంలో మహిళలు ప్రతి ఇంటి నుంచి దీపారాధన చేసి వినాయక స్వామి భక్తి పాటలు పాడారు. భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జనంలో పాల్గొన్నారు. సమీపంలోని కల్యాణి డ్యామ్‌లో స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీలో ఘనంగా టీచర్స్‌డే



జెఎస్‌రెడ్డిని సన్మానిస్తున్న వీసీ జేవీరమణ

తిరుపతిరూరల్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ లోకానికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శప్రాయుడని ఎస్వీవెటర్నరీ వర్సిటీ మెడిసిన్ విభాగ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ జేఎస్‌రెడ్డి పేర్కొన్నారు. వర్సిటీలోని లైబ్రరీహాల్‌లో టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం టీచర్స్‌డేనిఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన్ను దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, ఏడీ ప్రొఫెసర్ జగపతిరామయ్య, సంఘ అధ్యక్షుడు డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ వేణు, డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ కవిత,అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా మధుశేఖర్ జన్మదినం



మధుశేఖర్‌ని అభినందిస్తున్న టీడీపీనేతలు

తిరుపతిరూరల్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మల్లంగుంట సింగిల్‌విండో ఛైర్మన్ చెరుకూరి మధుశేఖర్ జన్మదినాన్ని గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయ ప్రాంగణంలో టీడీపీనేతలు, సన్నిహితుల నడుమ ఘనంగా జరుపుకున్నారు. భారీకేక్‌ని కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. టీడీపీ రూరల్‌మండల అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, ఆర్సీపురం సింగిల్ విండో ఛైర్మన్ జనార్దన్ చౌదరి, రావిళ్ల సురేంద్ర, శ్రీధర్‌నాయుడు, నాగూరు శ్రీనివాసులు, కిశోర్‌రెడ్డి, సాయి, కత్తిసుధాకర్, ఈశ్వరయ్య, మోహన్‌రెడ్డి, మునిరత్నం, భాస్కర్‌రెడ్డి, సురేష్‌నాయుడు, కవితా గోపాల్, చెరుకుల పరంధామయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ టీచర్లుగా ఎంపిక

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులుగా జిల్లా స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. నెరబైలు మోడల్ ప్రైమరీ స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్ బసవరాజ్ నాగరాజు, ఎల్లమంద పంచాయతీ ఓఎస్ గొల్లపల్లె ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ వెంకటాద్రిలు శుక్రవారం అవార్డులను అందుకోనున్నారు.



నాగరాజు- వెంకటాద్రి

దారి స్థలం విక్రయిస్తున్నారని ఫిర్యాదు



విక్రయిస్తున్న దారి స్థలం

చంద్రగిరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేటలో దిగువవీధికి చెందిన కొంతమంది దారి స్థలాన్ని విక్రయిస్తున్నారని బాధితుడు రవీంద్రనాయుడు తహసీల్దార్ శివరామసుబ్బకు ఫిర్యాదు చేశాడు. ఈసందర్భంగా రవీంద్రనాయుడు మాట్లాడుతూ దిగువీధి నుంచి చంద్రగిరి ప్రధాన మార్గంలోని దారి స్థలాన్ని విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈదారిలో రాకపోకలు సాగిస్తున్నామన్నారు. ఈ స్థలం విక్రయిస్తే దారి ఉండదని, న్యాయం చేయాలని తహసీల్దార్‌ని కోరారు. విచారించి చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఎస్వీసీఈలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్



శ్రీధర్‌ను అభినందిస్తున్న సుధాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): కరకంబాడీరోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ..ఉద్యోగసామర్థ్య నైపుణ్యాలపై శిక్షణ నిర్వహించారు. ఎన్ఎస్‌రెడ్డి ,కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మనోహర్‌రెడ్డి, డాక్టర్ ఎం.కళ్యాణ్‌కుమార్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సత్కారం

రామచంద్రాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పుస్తకాల నుంచే కాకుండా జీవిత అనుభవాలను మేళవించి పాఠాలు నేర్పుతారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు మార్కొండేయనాయుడు, జయవేలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చింతామణి గణపతి హోమం



రామచంద్రాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శక్తిపీఠంలో గురువారం చింతమణి గణపతి హోమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మరకతశక్తి కాళీ ఆలయంలో శక్తిగణపతికి తిరుమంజనానంతరం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం వేదపండితులు 11వేల కుడుమలతో చింతామణి గణపతి హోమం ప్రారంభించగా శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతి స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనా ర్యాలీ



రామచంద్రాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): లింగ సమానత్వం పెంపొదిద్దామని, బాల్య వివాహాలను అరికడదామని రామచంద్రాపురం క్లస్టర్ ఐసీడీఎ్‌స సూపర్‌వైజర్ మనీలా కోరారు. మిట్టూరులోని చూకూరి నాగమనాయుడు ఎర్రమ్మల జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులతో లింగ సమానత్వం కోరుతూ బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేశారు. ఎంఈవో మార్కొండేయనాయుడు మాట్లాడుతూ బాల్యవివాహాలు వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో తెలంగాణ సీఎస్



సీఎస్‌కు స్వాగతం పలుకుతున్న రిసెప్షన్ అధికారులు

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు గురువారం తిరుమలకు వచ్చారు. గాయత్రి గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. బస, దర్శన ఏర్పాట్లు చేశారు. సీఎస్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఇద్దరు వ్యక్తులకు గాయాలు

తిరుపతిరూరల్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): భీమవరం భోజనాలు రెస్టారెంట్ వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం కింద పడి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు గురువారం రాత్రి బర్రెలు గుంపుగా రావడంతో అటుగా వస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో వాహనం కిందపడి ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కి ఫోన్ చేశారు. సకాలంలో అంబులెన్స్ చేరుకోకపోవడంతో క్షతగాత్రులను కారులో ఆసుపత్రికి తరలించారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. మంగళవారం హుండీ ఆదాయం రూ.3.85 కోట్లు లభించింది. బుధవారం శ్రీవారిని 70,472మంది భక్తులు దర్శించుకోగా 25,247 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

ఏనుగుల నుంచి రక్షణకు ఆర్‌టీజీఎస్‌టీ టెక్నాలజీ

మంగళం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ఏనుగులు సంచరిస్తే ఆ సమీప గ్రామస్థుల మొబైల్ ఫోన్లకు సమాచారం వెళ్లే విధంగా ఆర్‌టీజీఎస్ టెక్నాలజీ తీసుకువచ్చినట్లు తిరుపతి డీఎఫ్‌వో వివేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వంద ఏనుగులు సంచరిస్తున్నాయని, వాటి నుంచి ప్రాణ, పంటనష్టం కలుగకుండా ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఏనుగులు గ్రామాల్లోకి, పంట పొలాల్లోకి వచ్చినపుడు వాటిని రెచ్చగొట్టే ప్రయత్నం చేయకూడదని సూచించారు. కొందరు ఏనుగులను నేరుగా చూడటానికి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలకు పక్కా ప్రణాళిక

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని ఎస్పీ హర్షవర్ధన రాజు అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, నాగభూషణరావుతోపాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పోలీసు శాఖ పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఇందుకోసం రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలని, క్యూలైన్ల ఏర్పాటుపై సమగ్ర నివేదికలు తయారు చేయాలని అన్నారు. టీటీడీతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాల్సిన అవసరముందన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

తడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండవ నెంబరు ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రెండవ ప్లాట్‌ఫాం సిమెంట్ బెంచీపై సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి అచేతనావస్థలో ఉన్నాడని స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందింది. ఆయన రైల్వే పోలీసులకు చెప్పడంతో వారు వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. తెలుపురంగుపై నీలంరంగు గళ్లచొక్కా, ఎర్రటిరంగులో దుస్తులు ధరించి ఉన్నాడని, అతని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కోరారు. పంచనామా నిమిత్తం శవాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రెండు బైక్‌ల స్వాధీనం ఇద్దరి అరెస్టు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద్ద గతంలో చోరీకి గురైన రెండు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో గురువారం నిందితుల వివరాలను వెల్లడించారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మణికంఠ, శ్రావణ్‌కుమార్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

పల్లం హాస్టల్ వార్డెన్‌కు షోకాజ్

ఏర్పేడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పల్లం ఎస్సీ హాస్టల్‌లో వసతులు కరువు అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితం అయింది. స్పందించిన జిల్లా అధికారులు పల్లం హాస్టల్‌లో పనిచేస్తున్న వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వాచ్‌మన్ నుంచి వంట దాక ఒకరే పనిచేస్తున్నారనే దానిపై స్పందించిన అధికారులు అవుట్‌సోర్సింగ్ కింద ఓ వ్యక్తిని పల్లం హాస్టల్‌లో పనిచేయడానికి గురు వారం నియమించారు. అలాగే ఏర్పేడు మండల పరిధిలో ఉన్న వైద్య బృందం హాస్టల్‌ను తనిఖీ చేసింది. పాడైపోయిన కుళాయిలు, అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను, కిటికీలను పరిశీలించి వీలైనంత త్వరగా పనులు చేపట్టి శుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్ రవికుమార్‌కు సూచించారు. హాస్టల్‌ను తనిఖీ చేసిన వారిలో మెడికల్ ఆఫీసర్ శివప్రియ, ఎంపీహెచ్ఎస్ సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది తులసీరామ్, లక్ష్మీ దేవి, ఏఎన్ఎంలు లక్ష్మి, మోహన, ఆశా వర్కర్ ప్రసూన ఉన్నారు.

నీరు పారేదెలా...?!

- మొక్కలు, ముళ్ల చెట్లతో నిండిన కాలువ
- పేరుకుపోతున్న మురుగు నీరు



ముళ్ల చెట్లతో నిండిన కాలువ

భాకరాపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాలం మారుతున్నా ఈ కాలువ మాత్రం అలాగే ఉంది. చిన్నగొట్టిగల్లు మధ్యలో నీటిపారుదల శాఖకు చెందిన కాలువను ఎవరూ పట్టించుకునే వారు లేరు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న కాలువ కరణం కుంట నుంచి వచ్చే వర్షపు నీటిని కొత్త కాలనీ గుండా చిన్నగొట్టిగల్లు చెరువుకు చేరుస్తుంది. చిన్నగొట్టిగల్లు విద్యుత్ సబ్-స్టేషన్ నుంచి చిన్నగొట్టిగంటి చెరువు వరకు కాలువ అస్తవ్యస్తంగా మారిపోయింది. అక్కడక్కడా కాలువ ఆక్రమణకు గురై నీరు సరిగా పారకపోవడంతో పోస్టు ఆఫీసు సమీపంలో గత వర్షాకాలంలో కాలువ తెగిపోయింది. వర్షపు నీరు ఇళ్లపై, రోడ్డుపైకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలువలో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లతో నిండిపోవడం వలన వర్షపు నీరు కాలువ గుండా ప్రవహించడం లేదు. చెత్తాచెదారాలతో నిండిపోయింది. చుట్టుపక్కల ఇళ్ల నుంచి మురుగునీరు కూడా కాలువలోకి వస్తోంది. ఫలితంగా దోమలు పెరిగి చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు విద్యుత్ సబ్-స్టేషన్ నుంచి చెరువు వరకు పూడిక తీసి ముళ్ల చెట్లను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కాలువలో నిలిచి ఉన్న మురుగు నీరు

గడువులోపు ఈ-పంట నమోదు : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదును ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్-2025 సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు జూలై 15 నుంచి ప్రారంభమైందన్నారు. పంట వేసిన, వేయని భూములను నమోదు చేయాలన్నారు. ప్రతి రైతుసేవా కేంద్రంలోని అధికారులు తమ పరిధిలోని భూముల వివరాలను ఈనెల 30వ తేదీలోపు నమోదయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పశసంవర్ధకశాఖ అధికారి రవి కుమార్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించండి

జిల్లా అభివృద్ధికి ప్రతి అధికారీ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సూచించారు. గురువారం రాత్రి విజయవాడ నుంచి భూగర్భ జలాలు, చెరువులు, భూ సమస్యలు తదితర అంశాలపై జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. జిల్లా ఖనిజ నిధుల కేటాయింపులు, కొత్త జిల్లాలకు నిధుల విడుదల, సీఎఫ్ఎంఎస్ లింక్ వంటి సమస్యలు పరిష్కరించాలని డివైడెడ్ డిస్ట్రిక్స్ మధ్య అప్రూవల్ పద్ధతిని పరిశీలించాలని విజయానంద్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. డీపీవో సుశీలాదేవి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుమల, తిరుపతిని దోచేశారు: కిరణ్



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భూమన కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి అలియాస్ 'టీడీఆర్'.. తిరుమల, తిరుపతిని దోచేశారని జనసేన నేత కిరణ్‌రాయల్ విమర్శించారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'టీడీఆర్ బాండ్లు, శ్రీవారి దర్శన, సేవా టిక్కెట్ల అక్రమ విక్రయం చేయలేదని అఖిలాండంవద్ద ప్రమాణం చేయగలరా? నేను అమ్మాయిలను విదేశాలకు తరలించి బిజినెస్ చేశానని దుష్ప్రచారం చేస్తున్నారు నిరూపించగలరా? నాపై నిరాధార ఆరోపణలు చేస్తే భూమన.. వైసీపీ కార్పొరేటర్ల బాగోతాన్ని బయట పెడతా. తండ్రీ కొడుకులను జైలుకు పంపకుండా ఎవరు కాపాడుతున్నారో చెబుతా. నాకు దొండకాయ అని పేరు పెట్టారు. ఇది ఆరోగ్యానికి మంచిదే. మీలాగా గంజాయి బ్యాచ్‌ని కాదు' అంటూ తీవ్ర విమర్శలు చేశారు.

రూ.21వేలకు లడ్డూ

- ఎస్పీ కార్యాలయంలో వేలంలో దక్కించుకున్న క్రైం సీఐ



సంప్రదాయ దుస్తుల్లో వినాయక విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గురువారం సాయంత్రం లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో క్రైం సీఐ ప్రకాష్ కుమార్ రూ 21 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈయనకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు లడ్డూ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో ఎస్పీ పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ కార్యాలయం నుంచి వినాయక సాగర్ వరకు విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, రిజర్వు సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాక వినాయకస్వామికి టీటీడీ పట్టువస్త్రాలు



తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో తిరుకల్యాణం సందర్భంగా గురువారం టీటీడీ తరుపున టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనకు ఆలయ ఈవో పెంచెల కిషోర్ కుమార్, ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ప్రదక్షిణం చేసి గర్భాలయంలో స్వామివారికి వస్త్ర సమర్పణ చేశారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండో రోజైన గురువారం శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి విశేష అభిషేక పూజలు చేపట్టారు. ఉత్సవర్లకు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ప్రధాన అర్చకుడు స్వామినాధన్ గురుకుల్, వేద పండితులు, అధికారులు పాల్గొన్నారు.

పవిత్రం సమర్పయామి



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : గోవిందరాజస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం పవిత్రాల సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలవిరాట్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శాత్తుమొర, ఆస్థానం వంటి వైదిక కార్యక్రమాల అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ప్రత్యేక పూజలు చేసి, కర్పూర హారతులు సమర్పించారు. ఆలయంలో ఊరేగించి మూలవిరాట్లకు పవిత్రమాలలను సమర్పించారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం, మాడవీధుల్లోని శ్రీమఠం ఆంజనేయ స్వామి కి పవిత్రమాలలు సమర్పించారు. సాయంత్రం ఉత్సవర్లు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తాదులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పెద్దజీయర్, చిన్న జీయర్లు, డిప్యూటీ ఈవో వీఆర్‌శాంతి, ఏఈవో ఏబీ నారాయణచౌదరి, సూపరింటెండెంట్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ చలమేశ్వర్



ఆలయం ముందు జస్టిస్ చలమేశ్వర్



వరుణ్ సందేశ్

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. జస్టిస్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. సినీ హీరో వరుణ్ సందేశ్ గురువారం వేకువజామున సతీమణి వితిక, కుటుంబ సభ్యులతో కలిసి సుప్రభాత సేవలో పాల్గొన్నారు.


శ్రీసిటీని సందర్శించిన సెజ్ జోనల్ డీసీ

సత్యవేడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ (వీఎస్ ఈజడ్) జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ గురువారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్) సీ.రమేష్ కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ఎగుమతులను ప్రోత్సహించాలనే కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా శ్రీసిటీలో ప్రత్యేక ఎగుమతుల సహాయ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డితెలిపారు. ఈ సమావేశంలో విశాఖ సెజ్ ఏడీసీ ప్రసన్న కుమార్. ఎస్‌ఓ కిషోర్ కుమార్, శ్రీసిటీ సెజ్ ఏడీసీ రామ్మోహన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విజ్ఞానాన్ని నేర్పాలి

- సంస్కృత వర్సిటీ సభలో మాజీ ఐఏఎస్ లక్ష్మీనారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ బిడ్డ ఇంజినీర్, డాక్టర్ కావాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారని, అయితే, విలువలు నేర్పే విద్య కావాలని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె. లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. 'ఎంపోరింగ్ ఎడ్యుకేషన్ త్రూ టెక్నాలజీ : ట్రెండ్స్ అండ్ ఇన్నోవేషన్స్' అంశంపై మూడు రోజులుగా తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీలో జరిగిన అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సంస్కృత భాష అంటే తనకు ఇష్టమైనా, చదివే అవకాశం కలగలేదన్నారు. అన్ని అభిప్రాయాలకు, ప్రజాస్వామ్యానికి తరగతి గది కేంద్రమని అభిప్రాయపడ్డారు. గొప్ప టాలెంట్ ఉన్న వారితోనే కాకుండా, సాధారణ విద్యార్థి అవసరం కూడా సమాజానికి ఉంటుందన్నారు. సంస్కృత భాష గొప్పదనాన్ని విలియం జోన్స్ కొనియాడారని గుర్తు చేశారు. ఎంత చదివినా క్రిటికల్ థింకింగ్, క్రియేటివిటీ, కొత్త దృష్టితో చూడటం, సమస్యల పరిష్కారం గురించి తెలియకపోతే చదువు నిరర్థకమన్నారు. దేశ నిర్మాతలు.. దేశ సంపద ఉపాధ్యాయులేనన్నారు. సంస్కృత భాషను, సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలని వీసీ కృష్ణమూర్తి ఆకాంక్షించారు. వేదాల్లోని టెక్నాలజీని దేశానికి అందించాలని కేంద్రీయ సంస్కృత వర్సిటీ రిజిస్ట్రార్ మురళీకృష్ణ అన్నారు. ప్రొఫెసర్ నాగమునిరెడ్డి, దుబాయ్‌కు చెందిన వెంకటరమణ్ కృష్ణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాధాగోవింద త్రిపాఠి, డీన్ వెంకట్రావు, భోపాల్‌కు చెందిన గోవిందపాండే, నేపాల్‌కు చెందిన గజేంద్రముని, డీన్ రజనీకాంత్‌శుక్లా, అధ్యాపకులు, విద్యార్థులు, దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వెళ్లిరా.. వినాయక!


శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిమజ్జనం వేడుకలు

తిరుపతి (క్రీడలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో గురువారం సాయంత్రం వినాయక నిమజ్జనం వేడుకలు ఘనంగా జరిగాయి. వినాయక చవితిని పురస్కరించుకుని కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటుచేసిన విగ్రహానికి తొమ్మిది రోజులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. చివరిరోజు సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రంగులు చల్లుకుంటూ కోలాహలంగా వినాయకుడిని ఊరేగింపుగా సాగనంపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్, సీనియర్ అసిస్టెంట్ సూర్యకళ, శశికళ, హరి, ప్రేమ్‌నాథ్, చక్రవర్తి, వినోద్, గోపి, హిందుజ, సాయి సుమతి, ఇజాజ్, నాగరాజ్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై నేటి నుంచి వలంటీర్లకు శిక్షణ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధిపై వలంటీర్లకు శుక్రవారం నుంచి మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తిరుపతి రోటరీ క్లబ్ సభ్యులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మాట్లాడుతూ తిరుపతి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో రుయా శస్త్రచికిత్సల విభాగంలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా క్యాన్సర్ బాధితులను గుర్తించడం, వారికి అవసరమైన వైద్యం అందించడం, ఉచితంగా మందులు ఇవ్వడం తదితరాల గురించి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

తిరుమలలో జీఎస్టీ ఎత్తివేయాలి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : తిరుమల కొండపై జీఎస్టీ ఎత్తివేయాలని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో జీఎస్టీ కింద రూ.150కోట్లకుపైగా టీటీడీ చెల్లించిందని వెల్లడించారు. కొండపై జీరో జీఎస్టీ ప్రకటించడం ద్వారా భక్తులు, యాత్రికులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి వీలుకలుగుతుందని తెలిపారు. పాలకమండలి స్పందించి అత్యవసర సమావేశం నిర్వహించి, తీర్మానం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాలని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

అలరించిన హరికథా గానం


కీచకవధ ఘట్టాన్ని వినిపిస్తున్న అలివేలు

తిరుపతి (కల్చరల్) సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రామ చంద్ర పుష్కరిణి లోని కళాక్షేత్రంలో గురువారం సాయంత్రం హరికథా గానం ఆకట్టుకుంది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహాభారతంలోని కీచకవధ ఘట్టాన్ని బి.అలివేలు వినిపించారు. ఈ గానం ఆహూతులను అలరించింది. కీబోర్డుతో గోపాల్‌రెడ్డి, తబలాతో నాగేంద్రప్రసాద్, శృతితో సంగీత సహకరించారు. కళాక్షేత్రం ప్రోగ్రాం అసిస్టెంట్ జె.పద్మ పర్యవేక్షించారు.

నేటి నుంచే క్రెడాయ్ ప్రాపర్టీ షో



మాట్లాడుతున్న క్రెడాయ్ చైర్మన్ గోపీనాథ్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్లో క్రెడాయ్ పాపర్టీషో 2025 శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ కె.గోపీనాథ్ తెలిపారు. లీలామహల్ సమీపంలోని క్రెడాయ్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ షో మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. ఓపెన్ ప్లాట్స్, అపార్టుమెంట్స్, విల్లాస్, స్టీల్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, ఫర్నిచర్, పెయింటింగ్స్, హోమ్‌లోన్‌కు సంబంధించి ప్రముఖ బ్యాంకులు, ఆటోమొబైల్స్, ఇతర కంపెనీల ప్రతినిధులు అందుబాటులో ఉంటారన్నారు. తుడా అప్రూవల్స్‌తో కూడిన అన్ని అనుమతులు కలిగిన, క్లియర్ టైటిల్ ప్రాపర్టీస్ వంటి వివరాలతో విచారించి కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో క్రెడాయ్ ప్రెసిడెంట్ ఎం.రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎ.రాజేష్‌బాబు, కార్యదర్శి పి.నరసింహారెడ్డి, ట్రెజరర్ కె.హరికృష్ణ పాల్గొన్నారు.

శ్రేష్ఠగురు అవార్డుల ప్రదానం



తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్ట్, రేవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మార్‌పల్లెలోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం రాత్రి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్‌ఎంలకు, మండల కోఆర్డినేటర్లకు శ్రేష్ఠగురు అవార్డులు అందజేశారు. ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తహసున్నిసా బేగం, ఎంఈవోలు బాలాజీ, భాస్కర్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తహసునిసా బేగం మాట్లాడుతూ తల్లి జ్ఞాపకార్థం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ గురువులను శ్రేష్ఠగురు అవార్డులతో సత్కరిస్తున్నామని చెప్పారు. ఎంఈవోలు మాట్లాడుతూ గురువుల ద్వారానే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణమౌతుందన్నారు. కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ ప్రెసిడెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

తిరుపతి

ఎస్వీయూకు ఐఎస్‌వో సర్టిఫికేషన్ జారీ



సర్టిఫికెట్‌తో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూకు ఐఎస్ఓ సర్టిఫికేషన్ జారీ అయ్యింది. విద్యా నైపుణ్యాలు, సమగ్రాభివృద్ధి, నిబద్ధత వంటి అంశాల్లో కృషికి గుర్తింపుగా ఐఎస్ఓ సర్టిఫికేషన్ ఇచ్చారు. రెండు రోజులుగా ఐఎస్ఓ ప్రతినిధుల బృందం యూనివర్సిటీ ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించింది.

ఎస్వీయూ స్టాండింగ్ కౌన్సిల్ చైర్మన్ నియామకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీకి స్టాండింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా న్యాయవాది టి.రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు గురువారం జారీ చేసింది. మూడేళ్ల పాటు ఈ స్థానంలో రమేష్‌బాబు కొనసాగనున్నారు. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎస్వీయూలో ఉపాధ్యాయ దినోత్సవం


సభను ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసా ఆడిటోరియంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పాల్గొని ప్రసంగించారు. సమాజంలో గురువుకు గొప్ప స్థానం ఉందన్నారు. ఆహ్లాదకరమైన యూనివర్సిటీలో విద్యార్థులు చక్కగా చదువుకుని రాణించాలని కోరారు. అధ్యాపకులు చంద్రాయుడు, ప్రయాగ, చంద్రశేఖరయ్య, నారాయణ, పద్మజ, సునీత, జ్యోతి, సరోజమ్మ, నాగజ్యోతి, హేమలత, స్వరూపరాణి, శ్రీదేవి, రమేష్‌బాబు, విజయలక్ష్మి, సుబ్బారావు, రమాశ్రీ, సుధారాణి, అఖిల స్వతంత్రను ఉత్తమ అధ్యాపక అవార్డులు అందజేసి సన్మానించారు. క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సుధారాణి, పద్మావతి, వేంకటేశ్వర్లు, శ్రీనివాసులు, టీవీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ గూడూరు 7వ అదనపు కోర్టు న్యాయమూర్తి కే.వెంకటనాగ పవన్ గురువారం తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు. 2021 ఫిబ్రవరి 4వ తేదీ రాత్రి సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్ట వద్ద షటిల్ ఆడుతుండగా చిన్నపాటి వివాదం తలెత్తడంతో మద్దూరు పవన్ కుమార్ అదే ప్రాంతానికి చెందిన నిమ్మల అనిల్ కుమార్‌ను కత్తితో పొడిచి చంపాడు. మృతుడి బంధువు వల్లూరు మణికంఠ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లురెడ్డి కేసు దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి జీవితఖైదు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ సహాసిని వాదించారు.

గంగమ్మ ఆలయ పాలకమండలికి పోటాపోటీ

మాకే కావాలంటూ పట్టుబడుతున్న కూటమి పార్టీలు

జనసేనకు ఇవ్వాలని అడిగాం : ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్



తిరుపతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి కోసం గట్టి పోటీ నెలకొంది. పాలకమండలిలో చోటుకోసం ఇప్పటికే 42 మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. వీరిలో 8 మందికి పైగా అభ్యర్థులు చైర్మన్ పీఠం కోసం పట్టుబడుతున్నారు. టీడీపీ నుంచి ఆరుగురు పోటీ పడుతుండగా జనసేన నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. టీడీపీ నుంచి నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, నాయకులు ఆముదాల తులసీరాం, కంకణాల రజినీకాంత్ నాయుడు, బాలసుబ్రమణ్యం రెడ్డి, జలపోతు చంద్ర, ఆనంద్ యాదవ్ పోటీపడుతున్నారు. జనసేన నుంచి బత్తిన మధుబాబు, హరీష్ శంకర్ ఉన్నారు. బీజేపీకి అవకాశం వస్తే పొనగంటి భాస్కర్ పేరు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఆశావహులు వారికున్న పరిచయాలతో ఆయా పార్టీ ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ క్రమంలో ఇటీవల ఆయా పార్టీల కార్యాలయాల నుంచి జాబితాలు ప్రభుత్వానికి వెళ్లాయి. టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ బాలసుబ్రమణ్యం రెడ్డి పేరును సిఫారసు చేసినట్టు పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఆయన అభ్యర్థిత్వంపై పార్టీలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆముదాల తులసీరాం, కంకణాల రజినీకాంత్, ఆనంద్ యాదవ్, జలపోతు చంద్రశేఖర్ రెడ్డి పేర్లను పరిశీలించే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ రెడ్డి సామాజికవర్గానికే ఇవ్వాల్సి వస్తే ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న జలపోతు చంద్రకు అవకాశం ఇవ్వాలని టీడీపీలోని మరో వర్గం భావిస్తోంది. ఇక రేసులో ముందున్న మహేష్ యాదవ్ పరిస్థితి విచిత్రంగా మారింది. నగర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన పేరును టీడీపీ ఇన్‌చార్జి విభేదించగా, జనసేన ఎమ్మెల్యే కార్యాలయం మాత్రం ఆయన పేరును సిఫారసు చేస్తూ జాబితా పంపడం చర్చగా మారింది. దీంతోపాటు జనసేన అభ్యర్థులు బత్తిన మధుబాబు, హరీష్ శంకర్‌లకు కూడా ఎమ్మెల్యే సిఫారసు లేఖలు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీ ఆదేశాల మేరకు మహేష్ యాదవ్ జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వెంట నడిచారన్న కారణంతో సుగుణమ్మ వర్గం అతడిని దూరం పెట్టిందన్న ఆరోపణలు న్నాయి. ఇన్‌చార్జి మంత్రి ఆశీస్సులు ఉన్నాయన్న ధీమాతో మహేష్ ఉన్నట్టు కనిపిస్తోంది. జనసేన కోటాలోకి వస్తే బత్తిన మధుబాబు ముందంజలో ఉన్నట్టు తెలుస్తోంది. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాటల్లో ఈ విషయం స్పష్టమైంది. టీటీడీ చైర్మన్ టీడీపీకి ఇచ్చారని, శ్రీవారికి చెల్లెలుగా పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ జనసేనకు ఇవ్వాలని అధినాయకత్వాన్ని కోరామని చెప్పారు. మధుబాబుకు దక్కేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఏదిఏమైనా మరో వారం, పదిరోజుల్లో గంగమ్మ ఆశీస్సులు ఎవరికి దక్కుతాయో తేలిపోనుంది.

కత్తితో రౌడీషీటర్ హల్‌చల్

● ఎస్టీవీ నగర్‌లో ఘటన

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీవీనగర్‌లో గురువారం ఒక రౌడీషీటర్ కత్తితో రోడ్లపై హల్‌చల్ చేశాడు. స్థానికుల సమాచారం మేరకు.. రౌడీషీటర్ రాహుల్ కత్తి చేతపట్టుకుని రోడ్లపై తిరుగుతూ వచ్చేపోయే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. స్థానికులు ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహకారంతో అతన్ని అదుపులోకి తీసుకుని, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఇటీవల రౌడీగ్యాంగ్‌లు ఎక్కువైపోయాయని, వారిని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

20 ఎర్రచందనం దుంగల స్వాధీనం


పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అధికారులు

మంగళం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-పీలేరు రహదారిలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఒక కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాసులుకు అందిన రహస్య సమాచారం మేరకు బుధవారం రాత్రి నుంచి పూతలపట్టు-పీలేరు రహదారిలో అధికారులు పెట్రోలింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున పులిచెర్ల వద్ద ఏపీ05 టీవీ 1345 నంబరు గల కారు వేగంగా రావడాన్ని గమనించారు. ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా వెళ్లిపోయారు. వెంబడించగా పూతలపట్టు టోల్‌గేట్ సమీపంలో కారును ఆపి పారిపోయారు. కారులో పరిశీలించగా 20 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారుతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.27.49లక్షలు ఉంటుందని ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయులు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో శశికుమార్, ఎఫ్‌బీవో చంద్రబాబు, డ్రైవర్ సాయికిరణ్, ప్రొటెక్షన్ వాచర్లు మునస్వామి, భార్గవ్, రాజా, చంద్ర పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుదేలు


మాట్లాడుతున్న మధుసూదన్

తిరుపతి (ఉపాధ్యాయ నగర్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, కూటమి పాలన వచ్చాక పురోగమిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రం అనేక సమస్యలు ఎదుర్కొందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రాన్ని మరింత కుదేలు చేసిందని విమర్శించారు. ఇప్పుడు కేంద్రం సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతోందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలుస్తూ, భవిష్యత్తు నిర్మాణంలో ముందుకు సాగుతోందని తెలిపారు. తనపై నమ్మకంతో అత్యున్నత బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ, రాష్ట్ర జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాలతో పార్టీని మరింత ముందుకు తీసుకెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ పాల్గొన్నారు. కాగా జల్లి మధుసూదన్‌ను బీజేపీ నాయకులు సన్మానించారు.

చిగోరా సేవా కేంద్రంలో గురు పూజోత్సవం


గురువులను సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : చిగోర ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో గురువారం గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం హాజరయ్యారు. వేద విశ్వవిద్యాలయ అధర్వణ వేద అసిస్టెంట్ ప్రొఫెసర్ బలభద్ర, విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ వీఆర్‌రాసాని, టీటీడీ పూర్వ విద్యాశాఖాధికారి చిత్రపు స్వరాజ్యలక్ష్మి, వెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ధర్మగిరి వేద పాఠశాల పాంచరాత్ర ఆగశాస్త్ర విభాగాధిపతి గొడవర్తి అనంత వెంకట దీక్షితులు, ఎస్వీ సంగీత నృత్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్, ఎస్‌జీఎస్ హైస్కూల్ హెచ్‌ఎం టీ.చంద్రయ్య, వేద పాఠశాల పాంచరాత్ర ఆగమ పండితులు జీవీ.రాఘవాచార్యులు, ఎస్వీ సంగీత నృత్య కళాశాల డోలు విశ్రాంత అధ్యాపకులు ఎం.రామచంద్రయ్య, గాత్ర అధ్యాపకురాలు డాక్టర్ కొల్లూరి వందన, హిందీ ఉపాధ్యాయులు నవలూరి శ్రీనివాసశర్మలను సన్మానించారు. చిగోర ఆధ్యాత్మిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు చిత్రపు హనుమంతరావు పాల్గొన్నారు.

తొమ్మిదో రోజు ప్రశాంతంగా నిమజ్జనం

వినాయకసాగర్‌కు తరలివచ్చిన బొజ్జ గణపయ్యలు



వినాయకసాగర్‌లో నిమజ్జనం చేస్తున్న భక్తులు

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగలో భాగంగా 9వ రోజు నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. నగరంలోని పలు ప్రాంతాల నుంచి విగ్రహాలు తరలిరావడంతో వినాయకసాగర్‌లో సందడి వాతావరణం నెలకొంది. గణపతి బప్పా మోరియా నినాదాలతో యువత హుషారుగా నిమజ్జనం ఊరేగింపులో పాల్గొన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ, పోలీసు శాఖ సమన్వయంతో వ్యవహరిస్తూ ఎలాంటి ఇబ్బందీ లేకుండా చేశారు. అలిపిరి సీఐ రామకిషోర్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కమిషనర్ మౌర్య పరిశీలించారు. నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సభ్యులు గుండాల గోపినాథ్, పృథ్వీరెడ్డి, కరాటే శ్రీనివాస్, ఎస్వీఎం వెంకటేష్ పాల్గొన్నారు.

పారదర్శకంగా 'నక్ష' సర్వే : కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నక్ష (రీసర్వే) కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. కచ్చపి ఆడిటోరియంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం నక్ష ఓరియంటేషన్ కార్యక్రమాన్ని వార్డు ప్లానింగ్, అమెనిటీ సెక్రటరీలు, వీఆర్వోలతో నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో చిన్న చిన్న స్థలాలు ఉండడం వలన జాగ్రత్తగా సర్వే చేయాలన్నారు. ఎవరికి వారు లక్ష్యం మేరకు 60 రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. ముందుగా ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు డిజిటల్ రికార్డింగ్ అవుతాయని, భవిష్యత్తులో ఎటువంటి న్యాయపరమైన చిక్కులూ ఉండవని అన్నారు. సర్వే బృందానికి భవన, స్థల యజమానులు పత్రాలను చూపించి ఆన్లైన్ రికార్డుల్లో స్థలాలను భద్రపరచుకోవాలని సూచించారు. ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ పారదర్శకమైన భూ రికార్డులు ఏర్పాటు చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారని అన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ మెంబరు కుమారమ్మ, కార్పొరేటర్ అన్నా అనిత, డీసీ అమరయ్య, డీసీపీ ఖాన్, తహసీల్దార్ సురేష్ బాబు, ఆర్వోలు సేతుమాధవ్, రవి పాల్గొన్నారు.

తిరుపతి పుణ్యక్షేత్రంలో తబ్లిక్ ఇస్తామా కార్యక్రమమా?

● అనుమతి ఇవ్వొద్దంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో తబ్లిక్ ఇస్తామా కార్యక్రమాలను నిర్వహించకుండా చూడాలని సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు హైదరాబాద్‌లోని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. తబ్లిక్ జామాద్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీల్లో తిరుపతిలో తబ్లిక్ ఇస్తామా కార్యక్రమం ఏర్పాటు చేశారని, దీనికి పోలీసుల అనుమతి కూడా తీసుకున్నారన్నారు. తబ్లిక్ జామాద్ సంస్థను సౌదీ అరేబియా ప్రభుత్వం నిషేధించిందని, ఇక్కడ ఎలా అనుమతి ఇస్తారని ఆయన ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దృష్టి సారించి ఇలాంటి సంస్థల కార్యక్రమాలు మన దేశంలో జరగకుండా కట్టుదిట్టం చేయాలని కోరారు.



గురుతర బాధ్యతలు



ఆది గురువు అమ్మ. తర్వాత స్థానం ఉపాధ్యాయుడిదే. అందుకే ఆచార్య దేవోభవ అంటారు. భావి తరాలను తీర్చిదిద్దే కీలక పాత్ర వీరిదే. తరగతి గదిలో విద్యాబుద్ధులు నేర్పించి విలువల బాటలో నడిపించి ఉత్తమ సమాజాన్ని నిర్మించాల్సింది వీరే. అందరిపై ఉపాధ్యాయుల ప్రభావం ఉంటుంది.. ఇదే రంగం నుంచి జీవితాన్ని ప్రారంభించి దేశంలో అత్యున్నత రాష్ట్రపతి స్థాయికి ఎదిగారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఉత్తమ ఉపాధ్యాయులకు ఆదర్శ నమూనా నిలిచారీ మహానుభావుడు. ఈయన జన్మదినంనాడు ఏటా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకొంటున్నారు. సర్వేపల్లి చూపిన స్ఫూర్తి పథాన నడుస్తున్న కొందరు టీచర్ల గురించి ఈ సందర్భంగా తెలుసుకుందాం.

● నేడు ఉపాధ్యాయ దినోత్సవం



విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుస్తులు అందిస్తున్న వెంకటరమణ

బోధనకు సేవా పరిమళాలు అద్దుతూ...



వడమాలపేట,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సేవాభావాన్ని జోడిస్తూ వృత్తికి వన్నె తెస్తున్నారు ఓటీఆర్ కండ్రిగకు చెందిన ఎల్లమరాజు వెంకటరమణ. 1988లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా కెరీర్ ప్రారంభించిన ఈయన ఎక్కడ పనిచేసినా తనదైన ముద్రవేసుకుంటున్నారు. ప్రస్తుతం వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వేతనంలో 20 శాతం పాఠశాల, విద్యార్థుల ప్రయోజనం కోసం వెచ్చిస్తుంటారు. పాఠాలు చెప్పడంతోనే సరిపెట్టుకోకుండా స్కూలుకు అవసరమైన బోధనోపకరణాలను సమకూర్చుతున్నారు. అవసరమైన పిల్లలకు యూనిఫాం, నోట్ పుస్తకాలు అందజేస్తుంటారు. పిల్లలకు ఆసక్తి కలిగించేలా నాన్నా చెప్పవా, మన శాస్త్రవేత్తలు, మదర్ ఎర్త్, స్వాతంత్ర్య సమర యోధుల కథల పుస్తకాలను తానే కొని విద్యార్థులతో చదివింపజేస్తున్నారీ ఆదర్శ ఉపాధ్యాయుడు. పనిచేసిన ప్రతిపాఠశాలలోనూ విద్యార్థుల,వారి తల్లిదండ్రుల ప్రేమాభిమానానికి పాత్రుడవుతున్నారు. ఈయన సేవలకు గుర్తింపుగా 2008లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా, తదుపరి ఏడాది రాష్ట్ర స్థాయిలోనూ పురస్కారం అందుకున్నారు..

ఫిజిక్స్ బోధిస్తే అర్థం కావాల్సిందే...

తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్లిష్టమైన ఫిజిక్స్ సబ్జెక్టును అర్థమయ్యేలా బోధించడం జోత్స్న ప్రత్యేకత. ఈమె రేణిగుంట మండలం గుత్తివారిపల్లి జడ్పీహైస్కూలులో పనిచేస్తున్నారు. ఫిజిక్స్ పాఠాలను ఆసక్తి కలిగేలా వివరించడమే కాకుండా ప్రయోగాత్మకంగా బోధిస్తారీమె. ఈమె పాఠం చెబితే బట్టీ పట్టకుండా సులభంగా పిల్లల మెదళ్ళలో నిలిచిపోతుంది. ఉపాధ్యాయులకూ ఉపయోగపడేలా ఆమె ఫిజిక్స్ మెటీరియల్‌ను తయారుచేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆమెవద్ద చదువుకున్న పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో ప్రాజెక్టులు తయారుచేశారు. ఫిజికల్ సైన్స్ ఫోరంలో నూతన విధానాల అమలుకు ఫోరంకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడంలో ముందుటుంన్నారు.



లెక్కల చిక్కులకు తులసి చిట్కాలు




తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): టి. తులసి. చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలు. గణితమంటే చాలామంది విద్యార్థులకు ముచ్చెమటలు పడతాయి. కష్టతరమైన లెక్కలను పిల్లలకు అర్థమయ్యేలా సులభమైన పద్ధతుల్లో బోధించడం తులసి టీచర్‌ది అందె వేసిన చేయి. గణితంపై భయాన్ని పోగొట్టి సులభంగా అర్థమయ్యేలా ప్రత్యేకంగా మెటీరియల్ కూడా తయారు చేశారు. ఇలా ప్రత్యేక పద్ధతుల్లో బోధిస్తూ మంచి గణిత టీచర్‌గా గుర్తింపు పొందారు. ఈక్రమంలోనే ఆమెను రాష్ట్ర విద్యాశాఖ కొత్త సిలబస్ తయారీలో సభ్యురాలిగా నియమించింది. పాఠ్యపుస్తకాల రచయితల్లో తులసి కూడా ఒకరు.

సిలబస్ తయారీలోనూ స్థానం




తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సి.భాగ్యశేఖర్ రెడ్డి. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఆంగ్లాన్ని బోధించడంలో ఈయన దిట్ట. పాఠానికి తగ్గట్టు ప్రత్యేకమైన కథలు, సామెతలు, సందర్భాలను ఉపయోగించుకుంటూ ఆంగ్ల పరిజ్ఞానాన్ని విద్యార్థుల మస్తిష్కంలో నిక్షిప్తం చెయ్యడంలో నేర్పరి. అందుకే ఆయనకు సిలబస్ తయారీలో స్థానం లభించింది. పాఠ్యపుస్తకాల రచయితగా, రిసోర్స్ పర్సన్‌గా గుర్తింపు పొందారు భాగ్యశేఖర్‌రెడ్డి.

సెలవు ఎరుగని భాస్కరుడు..



సత్యవేడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీలు చిక్కితే సెలవులు పెట్టేవారికి ఈ ఉపాధ్యాయుడు గురించి తెలుసుకోవల్సిందే. సత్యవేడు మండలం పీవీపురం జడ్పీ హైస్కూల్‌లో సైన్స్ టీచర్ మూకూరి భాస్కర్ ఎనిమిదేళ్ళుగా ఒక్క సీఎల్ గాని, ఎస్‌సీఎల్ గానీ వాడుకోలేదంటే విస్మయమే. 2000లో కుప్పం మండలంలో ఉపాధ్యాయుడిగా కెరీర్ ప్రారంభించిన ఈయన పాతికేళ్లలో ప్రతి స్కూలులోనూ అంకితభావంతో ప్రత్యేక ముద్ర వేసుకుంటున్నారు. 14 యేళ్లలో ఒక్క సెలవు కూడా తీసుకోలేదు. వరుసగా గత ఎనిమిదేళ్ళలో కూడా ఇదీరీతిలో నిబద్ధత చాటుకున్నారు. 2016లో వైరల్ జ్వరంతో బాధపడుతున్నా మాస్క్ ధరించి వచ్చారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో విద్యా మెటీరియల్‌ను విద్యార్థుల ఇళ్లకు చేర్చి ఉత్తీర్ణతకు తోడ్పడ్డారు. ఇప్పటివరకూ వివిధ పాఠశాలల్లో రూ. 5లక్షలతో వసతులను కల్పించారురు. సెలవు సమయాల్లో దాతలను సంప్రదించి రూ.20 లక్షలకు పైగా నిధులతో వసతులను ఏర్పాటు చేశారు. తన కుమారులిద్దరినీ టెన్త్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించారు. 2018లో భాస్కర్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు వరించింది.

అంకితభావానికి కేరాఫ్ ఆలీఖాన్



ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డులతో ఆలీఖాన్

పుత్తూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కుందిమాకుల గుంట గిరిజన కాలనీ. పట్టణానికి దూరంగా కొండల దిగువన నందిమంగళం పంచాయతీలోని ఈ కాలనీలో అందరూ రెక్కాడితే గాని డొక్కాడని వారే. ఈ శ్రమజీవుల పిల్లలను సరస్వతీ పుత్రులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు ఇక్కడి ప్రాథమిక స్కూలులోని ఏకోపాధ్యాయుడు షజాద్ ఆలీ ఖాన్. ఏడాదిలో అయిదు రోజులకు మించి సెలవు పెట్టని ఆయన తత్వమే చెబుతుంది ఆయన అంకితభావం. ఇక్కడి విద్యార్థులు అన్నిటా ముందంజ వేయాలనే సంకల్పంతో ఇంగ్లీషు భాష బోధన మీద ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. తెలుగులో ముత్యాల్లాంటి అక్షరాలను నేర్పిస్తున్నారు. తక్కువ మంది కావడంతో ప్రతి విద్యార్థి మీద అదనపు శ్రద్ధ పెడుతున్నారు. ఏకోపాధ్యాయుని మీద పూర్తి నమ్మకంతో గిరిజనులు తమ పిల్లలను శ్రద్ధగా స్కూలుకు పంపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఆలీఖాన్ హిందీ, ఇంగ్లిషుల్లో డబుల్ ఎంఏతోపాటు బీకాం, బీఈడీలను చేశారు. ఇరవై రెండేళ్ల కెరీర్‌లో ఆయన ఈ గిరిజనకాలనీలో ఐదేళ్లుగా పని చేస్తున్నారు. ఆయన పని నిబద్ధతకు తార్కాణంగా మూడు పర్యాయాలు మండల స్థాయి, ఓ సారి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డులు వరించాయి.

'ఆనంద్'మానందమాయె..

● హెచ్ఎం కృషితో వసతుల కల్పన



ఏర్పేడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆయనది రొటీన్‌గా విధులు నిర్వహించుకుపోయే తత్వం కాదు. అందువల్లే తాను పనిచేసిన స్కూలులో వసతులు లేకపోతే పట్టించుకోకుండా ఉండిపోలేదు. దాని రూపురేఖలు మార్చేందుకు నడుం బిగించారు. 2023 జూలైలో పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. స్కూలులో ప్రాథమిక వసతుల లేమిని గుర్తించారు. ప్రభుత్వం నుంచి గ్రాంటుతోనే ఇది సాధ్యం కాదని భావించారు. ఇందుకోసం ఆయన పరిచయస్తులు, మిత్రులు, పూర్వవిద్యార్థుల సహకారాన్ని అభ్యర్థించారు. వీరి చేయూతతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో సఫలీకృతులయ్యారు. బ్రాడ్‌కామ్ క్రైసంస్థ ద్వారా రూ.8లక్షలతో స్టెమ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయించడంలో కీలకభూమిక పోషించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి గ్రాంట్ నుంచి రూ.5లక్షలతో టాయిలెట్స్‌ను నిర్మించేందుకు చొరవ తీసుకున్నారు. తన మిత్రుడు, ఆర్టీసీ ఈడీ సహకారంతో 16 కిలోమీటర్ల మేర 12 గ్రామాల నుంచి పాఠశాలకు విద్యార్థులను తరలించడానికి ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించేలా కృషి చేశారు. ఆనంద్ అభ్యర్థనపై స్పందించిన పూర్వ విద్యార్థి (చింతలపాళెం) శివశంకర్ రూ.3లక్షలతో పాఠశాల ఆవరణలో స్టేజీ నిర్మిస్తున్నారు మరో పూర్వవిద్యార్థి పరమాల చంద్రశేఖర్ సహకారంతో రూ.50వేలతో పీఎంసీ ఎంబ్లమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హెచ్ఎం చొరవ ఫలితంగా స్కూలులో విద్యార్థుల సంఖ్య వెయ్యికి చేరింది.

శెభాష్..సురేష్



తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దళవాయి సురేష్.. అప్పలాయగుంటలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను విద్యార్థుల సంఖ్యను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఒకప్పుడు ప్రాథమికోన్నత పాఠశాలగా ఓ వెలుగు వెలిగిన ఈ స్కూలు ఏడుగురితో ప్రాథమిక పాఠశాలగా మారింది. ఇటీవల మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించారు. ఈ పాఠశాలకు హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన సురేష్.. వచ్చీరాగానే చట్టుపక్కల గ్రామాలన్నీ తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడారు. స్వయంగా తానే కారులో తీసుకువెళ్లి విద్యార్థులను తిరిగి తీసుకువస్తానని, పెద్దలను ఒప్పించారు. దీంతో 60 మంది విద్యార్థులను చేర్పించగలిగారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నారు.


విద్యార్థులకు చేయూత.. ఈ విద్యాప్రదాత



తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బండి మధుసూదన్‌రెడ్డి ..తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన 1991లో ఉపాధ్యాయులుగా రిక్రూట్ అయ్యారు. 34 ఏళ్లగా పేద విద్యార్థులకు విద్యా సౌకర్యాలు, పాఠశాలల్లో వసతుల కల్పనకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా విద్యాకిట్లు అందించని కాలంలో ఆయనే కొందరు విద్యార్థులకు నోటుపుస్తకాలు సమకూర్చేవారు. దాతల సాయంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులకు చేయూతనందించడం ప్రారంభించారు.బల్లలు, బెంచీలు, బ్లాక్‌బోర్డులు తదితర వసతుల కల్పనకు పాటుపడుతున్నారు. ఏటా 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్నారు. వికలాంగ విద్యార్థులకు ట్రైసైకిల్స్ అందజేస్తున్నారు. మొక్కలు నాటిస్తూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు. 2006లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ, 2014లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు.

కన్నతండ్రే కాలయముడు

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య



హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్ల దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

» కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు

» ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు

» తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..

» తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే

» సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక



ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

జిల్లా ఉత్తమ ఎంఈవోగా రవీంద్రనాథ్



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంఈవో రవీంద్రనాథ్ ఎంపికయ్యారు. తిరుపతిలో శుక్రవారం జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ చేతుల మీదగా అవార్డు అందుకోనున్నారు.

సింహ వాహనంపై అవనాక్షమ్మ కటాక్షం



నారాయణవనం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ ఆలయమైన అవనాక్షమ్మ ఆలయ వార్షిక జాతరలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయాన్ని శుద్ధి చేసి తోమాల తదితర నిత్య కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం సుగంధ పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అంకృతులైన అమ్మవారు సింహ వాహనంపై అధిరోహించి సముదాయం గ్రామ వీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర నీరజనాలు సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు ఉత్సవాలను పర్యవేక్షించారు.

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే, జడ్పీటీసీ

సాయంత్రం ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సుమన్ కుమార్ అవనాక్షమ్మ సేవలో తరలించారు. నారాయణవనం సర్పంచ్ కుమారుడు లక్ష్మన్, టీటీడీ ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు, టీడీపీ నాయకులు మాణిక్యంరెడ్డి, ఊరప్ప, కేఎస్.రవి, సుధాబాబు, కుట్టి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఆముదాలవలస ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం పబ్లిక్ అండర్‌టేకింగ్ చైర్మన్, ఆముదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగ తం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అంద జేశారు.

విద్యాహబ్‌గా శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయి విద్యాలయాలకు కేంద్రగా శ్రీకాళహస్తి నియోజక వర్గాన్ని తీర్చిదిద్దేందుకు బొజ్జల కుటుంబం విశేషంగా కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిసి ఆయనను సత్కరించి డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈసందర్భంగా ఉమేష్‌రావు మాట్లాడుతూ గత వైసీపీప్రభుత్వం స్కిట్ కళాశాలను నిర్వీర్యంచేసిందన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి బాధ్యతలు తీసుకోవడంతో కళాశాలలో తిరిగి తరగతులు నిర్వహించేందుకు మంత్రి నారా లోకేష్‌తోకలిసి ఎంతో కృషి చేశారన్నారు. ఇపుడు నవోదయ విద్యా లయాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థాపించేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు పొందడం బొజ్జల కుటుం బం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యం ఏమిటో తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు చెంచయ్యనాయుడు, లక్కమనేని మధుబాబు, పేట బాలాజీరెడ్డి, మునిరాజాయాదవ్, గాజుల భగత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం



ఏర్పేడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఈవో రామచంద్రారెడ్డి ఆహ్వానించారు. గురువారం విజయవాడలో మంత్రిని కలిసి పరశురామేశ్వరుడి చిత్రపటం బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. త్వరలో వస్తానని మంత్రి తెలిపారు.

పల్లికొండేశ్వరుడి ట్రస్టు బోర్డు ఆశావహుల దరఖాస్తుల పరిశీలన

నాగలాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకం కోసం ఆశావహులు నుంచి అందిన దరఖాస్తులను దేవదాయ శాఖ అధికారుల బృందం పరిశీలించారు. గురువారం ఆలయ కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో ఈవో లత ఆధ్వర్యంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి, దేవదాయ శాఖ టెంపుల్‌ఇన్‌స్పెక్టర్ ఫణిరాజసయన, జూనియర్ అసిస్టెంట్ దినేష్ బృందం దరఖాస్తులను పరిశీలించింది. ఈ క్రమంలో ట్రస్టు బోర్డు నియామకానికి సంబంధించి 104 దరఖాస్తులు అందగా, 83 మంది దరఖాస్తు పరిశీలనకు హాజరైనట్టు దేవదాయ అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తు పరిశీలనకు 21 మంది గైర్హాజయ్యారు. మిగిలిన దరఖాస్తులను కూడా సెప్టెంబరు 6వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరిశీలించనున్నట్లు ఈవో లత పేర్కొన్నారు.

సర్పంచ్ కుర్చీ మార్చేశారు..!



సర్పంచ్ కుర్చీ మార్చి అదేస్థానంలో వేసిన ప్లాస్టిక్ చైర్

రేణిగుంట 4(ఆంధ్రజ్యోతి): రేణి గుంట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుర్చీని మార్చేశారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ నాగేశం గురువారం కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. ఈవో చెప్పడంతో కుర్చీని తీసి వేరొక కుర్చీని వేసినట్లు సమాధానం ఇచ్చారు. దీనిపై సర్పంచ్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రథమ పౌరుడికి ఇవ్వాల్సిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు విచారించి పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

20 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● కారు సీజ్

మంగళం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-పీలేరు రహదారిలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఒక కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాసులుకు అందిన రహస్య సమాచారం మేరకు బుధవారంరాత్రి నుంచి పూతలపట్టు-పీలేరు రహదారిలో అధికారులు పెట్రోలింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున పులిచెర్ల వద్ద ఏపీ05 టీవీ 1345 నంబరు గల కారు వేగంగా రావడాన్ని గమనించారు. ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా వెళ్లిపోయారు. వెంబడించగా పూతలపట్టు టోల్‌గేట్ సమీపంలో కారును ఆపి పారిపోయారు. కారులో పరిశీలించగా 20 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారుతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.27.49లక్షలు ఉంటుందని ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయులు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో శశికుమార్, ఎఫ్‌బీవో చంద్రబాబు, డ్రైవర్ సాయికిరణ్, ప్రొటెక్షన్ వాచర్లు మునస్వామి, భార్గవ్, రాజా, చంద్ర పాల్గొన్నారు.



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అధికారులు

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

శ్రీనివాససత్రంలో బందోబస్తు

కోట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీనివాససత్రం బీచ్ వద్ద గురువారం భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం నెల్లూరు జిల్లా మనుబోలు మండలం పిడూరు గ్రామానికి చెందిన యశ్వంత్ శ్రీనివాససత్రం బీచ్‌లో అలలకు కొట్టుకుపోయి మృతి చెందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మనమిత్ర యాప్ ద్వారా 161 సేవలు

వాకాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మనమిత్ర యాప్ ద్వారా 161 సేవలు పొందవచ్చని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుంచి మనమిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సచివాలయాల సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు.

సచివాలయ భవన ప్రారంభానికి ముహూర్తమెప్పుడో?



మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని వెలికల్లు సచివాలయ భవనం

డక్కిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముహూర్తం కుదరలేదో... ప్రజాప్రతినిధులకు తీరిక లేదో కానీ వెలికల్లు గ్రామ సచివాలయ భవనం మూడేళ్లుగా ప్రాంభానికి నోచుకోవడం లేదు. డక్కిలి మండలం వెలికల్లు గ్రామ సచివాలయ భవనం రూ.40 లక్షల వ్యయంతో మూడేళ్ల క్రితమే నిర్మించారు. ప్రస్తుత దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అప్పట్లో వైసీపీ నుంచి వెంకటగిరి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. అయితే ఆయన ప్రాధాన్యం తగ్గిస్తూ నేదరుమల్లి రాంకుమార్ రెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో సచివాలయ భవనం ప్రారంభోత్సవం జరగలేదు. తర్వాత కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా సచివాలయ భవనాన్ని ప్రారంభించలేదు. ప్రస్తుతం ఇరుకైన పంచాయతీ భవనంలో సచివాలయ సిబ్బంది కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఒక్కసారిగా పది మంది వస్తే నిల్చోవడానికి కూడా స్థలం ఉండదు. సచివాలయ సిబ్బంది ఇబ్బంది పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఇక కొత్త భవనం వినియోగంలో లేకపోవడంతో తలుపులు, కిటికీలకు చెదలు పట్టి దెబ్బతినడంతో సర్పంచ్ మరమ్మతులు చేసినట్లు తెలిసింది. కాగా, మంత్రి ఆనం రామనాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణల చేతుల మీదుగా సచివాలయ భవనాన్ని ప్రారంభించాలని స్థానిక నేతలు భావిస్తున్నట్లు తెలిసింది. అయితే మంత్రికి వీలున్నప్పుడు, ఎమ్మెల్యేకు సమయం లేకపోవడంతో తేదీ ఖరారు కావడం లేదని సమాచారం. ప్రజాప్రతినిధులు సచివాలయ భవనాన్ని ప్రారంభించి సిబ్బంది ఇబ్బందులను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పుత్తూరు వార్తలు

చెరువులు, కాలువల ఆక్రమణ

● హైకోర్టులో ప్రజాప్రయోజనాల వాజ్యం



తుమ్మల చెరువులో ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ముప్పు కలిగించేలా పుత్తూరులో చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురవుతు న్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయి తాగునీటి సమస్య తీవ్రతరమవుతోంది. ఈ ఆక్రమణలపై సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.ప్రజాప్రయోజనాల వాజ్యం వేశారు. విచారణకు స్వీకరించిన కోర్టు పిల్ నెంబర్ 44/2025ను కేటాయించింది. ఇందులో ప్రతివాదులుగా తొమ్మిది మందిని పొందుపరిచారు. వీరిలో ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, రెవెన్యూ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, తిరుపతి ఆర్డీవో, పుత్తూరు మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పంచాయతీ సెక్రటరీ, ఇరిగేషన్ ఇఇ ఉన్నారు. స్థానిక వేపగుంట, చెర్లోపల్లి ప్రాంతాల్లో చెరువు, కాలువ ఆక్రమణకు గురైందని వాజ్యంలో పేర్కొన్నారు. వేపగుంట పరిధిలోని సర్వే నెంబర్ 57లో 28.75 ఎకరాలు విస్తీర్ణం కలిగిన తుమ్మల చెరువు ఆక్రమణకు గురైందని తెలిపారు. ఈ చెరువు ఆక్రమణలో కొందరు విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ ముసుగులో చెరువును ప్లాట్లుగా విక్రయిస్తున్నారని వివరించారు. చెర్లోపల్లి లెక్కదాఖలాల్లోని సర్వే నెంబర్ 117, 118-1/1ఎ ఒరవ కాలువను ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మించారని, తడుకు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 6/4, 6/5లోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించి విక్రయిస్తున్నారని వాజ్యంలో పేర్కొన్నట్లు వివరించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం పుత్తూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లు వేపగుంట తుమ్మల చెరువు ఆక్రమణను పరిశీలించారు. రికార్డులను పరిశీలించడంతో పాటు సర్వే చేయించారు. కోర్టుకు నివేదికను పంపనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నష్ట పరిహారం చెల్లించాలి



నిరసన చేస్తున్న భాధిత రైతులు


వడమాలపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పాదిరేడు అరణ్యం భూములకు సంబంధించి టీటీడీ నష్టపరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరారు. గురువారం ఆ భూముల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులు గృహ అవసరాల నిమిత్తం పాదిరేడు అరణ్యంలో ఎస్టీ, ఎస్సీలకు చెందిన భూములు స్వాధీనం చేసుకొందన్నారు. కొంత మందికి నష్టపరిహారం చెల్లించి ఇంకొందరికి ఇవ్వలేదని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

టీచర్ నాగరాజుకు సన్మానం



వడమాలపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పి.నాగరాజును టీచర్స్‌డేను పురస్కరించుకుని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. ఈయన సొంత నిధులతో పాఠశాలకు పెయింట్ వేయడం, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్ నాయుడు, హరి నాయుడు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వినాయక ఊరేగింపులో ఎమ్మెల్యే భానుప్రకాష్



వడమాలపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. గురువారం మండలంలోని లక్ష్మమ్మ కండ్రిగలో వినాయకుని ఊరేగింపులో ఆయన పాల్గొన్నారు. నాయకులు ఉదయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మార్గదర్శకుడు



పుత్తూరు, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు ఓ మార్గదర్శకుడని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరయ్య, వాణిశ్రీ, సుజన, శ్రీదేవిలు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

పుత్తూరు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని పుత్తూరు డివిజన్‌లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు కోరారు. గురువారం వారు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ మాట్లాడుతూ త్వరలో జిల్లా, రాష్ట్ర స్థాయి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. పుత్తూరు, నగరి, నాగలాపురం సబ్‌డివిజన్ నాయకులు శివప్రసాద్, మూర్తి, వర్మ పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



న్యాయవాదులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర కోరారు. గురువారం కోర్టు హాలులో న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్య సాయి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గాలి సురేష్‌బాబు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్‌లోకి ఎల్‌ఐసీ ఏజెంట్ త్యాగరాజు



ఎల్ఐసీ సంస్థ మేనేజర్ హేమాద్రి నుంచి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు ప్రశంస పత్రం అందుకుంటున్న త్యాగరాజు

పిచ్చాటూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భారత జీవిత బీమా సంస్థ నుంచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రశంస పత్రాన్ని పిచ్చాటూరుకు చెందిన త్యాగరాజుకు లభించింది. గురువారం పుత్తూరు ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో ఆ సంస్థ మేనేజర్ హేమాద్రి ఆధ్వర్యంలో జరిగిన పురస్కార కార్యక్రమంలో త్యాగరాజుకు ప్రశంస పత్రాన్ని మేనేజర్ చేతుల మీదుగా అందించారు. ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటశెట్టి, బ్రాంచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా మేరీ



రేణిగుంట సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా రేణిగుంట జ్యోతినగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు టి లూవినామేరీ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి, టిడిపి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్‌కు, మండలంలోని పార్టీ పెద్దలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంజేపీబీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

సత్యవేడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మహాత్మ జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో గురువారం పాఠశాల ప్రిన్స్‌పాల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో రవి ముఖ్య అతిథిగా హాజరై దివంగత మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

టీచర్ వెంకటరమణకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు

నాగలాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం టీపీ కోట మోడల్ ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయులు వీరమంగళ వెంకటరమణ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మండలంలోని విద్యాశాఖ అధికారులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

జాతరకు రావాలని సీఎంకు ఆహ్వానం



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పక్కన ఆలయ చైర్మన్ మురళీ కృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పోలేరమ్మ జాతర విచ్చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆహ్వానించారు. గురువారం అమరావతిలోని సీఎం నివాసానికి వెళ్లి జాతర ఆహ్వాన పత్రిక అందజేశారు. అంతకుముందు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలిసి జాతరకు ఆహ్వానించారు. ఎమ్మెల్యే వెంట పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఈవో శ్రీనివాసులు రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధనాయుడు, గొల్లగుంట చరణ్, గంగాధర్ ఉన్నారు.

భూముల మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

డక్కిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలో రీసర్వే పూర్తి కాని గ్రామాల్లో ఎఫ్‌పీఓఎల్ఆర్ కింద ఈ నెల 15వ తేదీ లోగా మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. భాగ పరిష్కారం చేసుకున్న అసైన్‌మెంటు భూములను మార్పు చేసుకోవచ్చన్నారు.

క్యాన్సర్ పరీక్షలు

బాలాయపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బాలాయపల్లి జయంపు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురు వారం ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి హరిత బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మహిళలకు రొమ్ము క్యాన్సర్, పురుషులు, మహిళ లకు నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లియోనా, పంచాయతీ కార్యదర్శి లీలావతి పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన టీడీపీ నేతలు



మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో టీడీపీ నాయకులు

పెళ్లకూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను పెళ్లకూరు మండల టీడీపీ నాయకులు గురువారం అమరావతిలో కలిశారు. మండలంలోని పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఎంపీడీవోతో పాటు ఇతరశాఖల అధికారులు మండలాభివృద్ధిని అడ్డుకుంటున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, నాయకులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కాటూరు గోపాల్‌రెడ్డి, కలవకూరు మునీష్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్‌లో సమర్పిస్తున్న ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా అధికారులు మండలంలో విచారణ చేపడుతున్నారు. ప్రజలు సమర్పిస్తున్న ఫిర్యాదులు క్షేత్ర స్థాయిలో పరిష్కారానికి నోచుకోక పోయిన, పరిష్కారం కాబడినట్లు ఫిర్యాదు దారుల మొబైల్‌లకు సందేశాలు వస్తున్నాయని జిల్లా అధికారులకు బాధితులు అందించిన ఫిర్యాదు మేరకు మండలంలోని పలు పంచాయతీల్లో ఎంపీడీవో ఆధ్వర్యంలో కమిటీ బృందం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ప్రజలు అందించిన 850 ఫిర్యాదులకు సంబంధించి సమస్యలు పరిష్కరించకుండానే పరిష్కరించేసినట్లు క్షేత్ర స్థాయిలో సిబ్బంది ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు గుర్తించారు. అర్జీలు సమర్పించిన ప్రతి ఒక్కరినీ కలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో డీవీఎంసీ మెంబర్ ఇందిరానగర్ సచివాలయంలో కమిటీ బృందానికి కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీజీఆర్ఎస్ వ్యవస్థపై నమ్మకం కగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమస్యలను వఅలైనంత త్వరగా పరిష్కరించేలా కలెక్టరేట్ తరహాలో మండల స్థాయి కార్యాలయాల్లోనూ అధికారులు అందరూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిటీ బృందాన్ని కోరారు.

నేటి నుంచే క్రెడాయ్ ప్రాపర్టీ షో

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్లో క్రెడాయ్ పాపర్టీషో 2025 శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ కె.గోపినాథ్ తెలిపారు. లీలామహల్ సమీపంలోని క్రెడాయ్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ షో మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. ఓపెన్ ప్లాట్స్, అపార్టుమెంట్స్, విల్లాస్, స్టీల్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, ఫర్నిచర్, పెయింటింగ్స్, హోమ్‌లోన్‌కు సంబంధించి ప్రముఖ బ్యాంకులు, ఆటోమొబైల్స్, ఇతర కంపెనీల ప్రతినిధులు అందుబాటులో ఉంటారన్నారు. తుడా అప్రూవల్స్‌తో కూడిన అన్ని అనుమతులు కలిగిన, క్లియర్ టైటిల్ ప్రాపర్టీస్ వంటి వివరాలతో విచారించి కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో క్రెడాయ్ ప్రెసిడెంట్ ఎం.రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎ.రాజేష్‌బాబు, కార్యదర్శి పి.నరసింహారెడ్డి, ట్రెజరర్ కె.హరికృష్ణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్రెడాయ్ చైర్మన్ గోపీనాథ్

అతిసార బాధితులకు కోలా ఆనంద్ పరామర్శ



రేణిగుంట సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అతిసార సోకి చికిత్స పొందుతున్న బాధితులను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ పరామర్శించారు. గురువారం మధ్యాహ్నం విమానాశ్రయం సమీపంలోని బాలాజీ హస్పిటల్లో చికిత్స పొందుతున్న గర్తివారిపల్లెకు చెందిన గ్రామస్థులను కోలా ఆనంద్ పరామర్శించారు. పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలాజీ, రాజారాయల్, నరేష్ రాయల్ పాల్గొన్నారు.

ఏర్పేడులో ఉపాధ్యాయ దినోత్సవం



విశ్రాంత హెచ్ఎం రామచంద్రనాయుడును సత్కరిస్తున్న ఉపాధ్యాయుల బృందం

ఏర్పేడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ముందుస్తుగా నిర్వహించారు. పాఠశాలలో పని చేసిన పూర్వపు ప్రధానోపాధ్యాయులు రామచంద్రనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మునిలక్ష్మి, ఉపాధ్యాయులు మోహన్‌బాబు, భానుప్రకాష్, ధరణి కుమార్, మధు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

కేవీబీపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సెలవు రావడంతో ఎంఈవోలు ఒకరోజు ముందుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక ఎస్‌బీఐ శాఖ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసింది. ఎంఈవో రవికుమార్, హెచ్ఎం సురేష్ పాల్గొన్నారు.

టైర్లస్ కాలనీని అభివృద్ధి చేస్తాం: సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్ కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టైలర్స్ కాలనీలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషితారెడ్డి హాజరయ్యారు. శ్రీకాళహస్తి టైలర్స్ అసోసియేషన్ నాయకులు వారికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. సొంత నిధులతో టైలర్స్‌కు లైఫ్ ఇన్సూరెన్సు చేసి కార్డులను టైలర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలర్లకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, పోలారు శ్రీనివాసులురెడ్డి, టైలర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

- 10 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి



రేణిగుంట సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు చోరీచేస్తున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ 5.70 లక్షలు విలువచేసే 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్బన్ పోలీస్ స్టేషన్లో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలో 64 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ ద్విచక్ర వాహనాల దొంగ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం మదివర్తిపాలెం దళితవాడకు చెందిన దొడ్ల సంతోష్, అతడు రేణిగుంట ఉదయం చెక్ పోస్ట్ కూడలి వద్ద పట్టుబడ్డాడు. ఇతనిపై చంద్రగిరి, అలిపిరి, తిరుచానూరు, బాకరాపేట, నెల్లూరు రూరల్, రేణిగుంట పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే 48 ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో అతడు జైలుకు వెళ్లి వచ్చాడు. దొంగను అరెస్టు చేసిన సీఐ జయచంద్ర, ఎస్ఐ నాగార్జున, పీఎస్ఐ స్వాతి, కానిస్టేబుళ్లు రాజశేఖర్, బారుషా, గౌరీ నాయుడు, శీను, చలపతిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

దొక్కా సీతమ్మ అన్నదానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నాయకుల ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పవన్ కళ్యాణ్ ఆశయ సాధనలో భాగంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రతి గురువారం పేదలకు అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, ప్రదీప్‌కుమార్, గండం శ్రీను, మణి, సతీష్, మునిచంద్ర, చందు, సాయి, యాసిన్‌బాషా, మునికుమార్, వీరమహిళలు బత్తెమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జన సురక్షపై అవగాహన

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాంపల్లి గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రైతులు, మహిళలకు ప్రధానమంత్రి జనసురక్ష బీమా, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ఆటల్ పెన్షన్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు తిరుపతి ప్రాంతీయ అధికారి ప్రకాష్ రత్నబాబు, వల్లం మేనేజరు శివ మానందరెడ్డి, ఎపీఎల్‌సీ కౌన్సిలర్లు జయశేఖర్, చిగురుపాటి కిరణ్, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, నాయకులు చరణ్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

చెంబేడు కాలువ ప్రక్షాళనకు ఎమ్మెల్యే శ్రీకారం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చెంబేడు కాలువ ప్రక్షాళనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా చెంబేడు కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా పట్టణంలో ఎక్కడా కాలువల్లో చెత్త పేరుకపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా చెత్తను కాలువల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండో రోజైన గురువారం శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ-శాక-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి విశేష అభిషేక పూజలు చేపట్టారు. ఉత్సవర్లకు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్, వేద పండితులు, అధికారులు పాల్గొన్నారు.



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

కష్టపడిన వారికే పదవులు: సుధీర్‌రెడ్డి

రేణిగుంట సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కష్టపడిన వారికే పదవులు వస్తాయని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలియజేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సింగిల్ విండో చైర్మన్‌గా భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లుగా నీలకంఠరెడ్డి, గజేంద్రయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విచ్చేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివిధాలుగా రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తుందని తెలియజేశారు. రేణిగుంట మండలంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచుతామని తెలిపారు. రేణిగుంటలో శాశ్వత మంచినీటి పథకానికి రూ.14.50 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఆలాగే స్థానిక మంచినీళ్ల గుంటను ఉడా నిధులతో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. రానున్న ఏడాదిలోగా మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ 3 సెంట్ల భూమిని పంపిణీ చేస్తామన్నారు. మండలంలో అధికార పార్టీ నాయకులు ఎవరైనా దోపిడీకి పాల్పడితే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు ముని చంద్రారెడ్డి, మెహబూబ్ బాషా, నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిస్వామి నాయుడు, బుజ్జి నాయుడు, భాస్కర్ రెడ్డి, వెంకటమునిరెడ్డి పాడి రాజేంద్ర, పుష్పనాథం, కన్నన్‌రెడ్డి, కొరియర్ రవి కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న భాస్కర్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, గజేంద్రయ్య

గ్రామస్తుల ఫిర్యాదుతో ఆలత్తూరు రోడ్డుకు మరమ్మతులు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు పరిధిలో ఉన్న క్వారీలు, క్రషర్లు, పరిశ్రమల యాజమాన్యాలు ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆదేశాలతో ఆలత్తూరు రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. శ్రీకాళహస్తి - ఊడ రోడ్డు నుంచి ఆలత్తూరు మీదుగా రెడ్డిగుంట బూడిద, పీవీకండ్రిగ గ్రామాల వరకు క్వారీ, క్రషర్లు నుంచి టిప్పర్ల ద్వారా మెటల్, దుమ్మును తీసుకుపోవడం వలన రోడ్డు గుంతలమయమై ప్రయాణం దుర్భరంగా మారింది. దీంతో ఆలత్తూరు గ్రామస్తులు గతవారం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీవోకు విన్నవించారు. ఎంపీడీవో రోడ్డును పరిశీలించి కార్యదర్శి ద్వారా ఆలత్తూరు పరిధిలో ఉన్న క్వారీలు, క్రషర్లకు నోటీసులు పంపాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్పందించిన క్వారీల యాజమాన్యం రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు.

శ్రీసిటీని సందర్శించిన విశాఖ సెజ్ జోనల్ డీసీ

సత్యవేడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ (వీఎస్ ఈజెడ్) జోనల్ డెవలప్ మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ గురువారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్) సి.రమేష్ కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ఎగుమతులను ప్రోత్సహించాలనే కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా శ్రీసిటీలో ప్రత్యేక ఎగుమతుల సహాయ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో విశాఖ సెజ్ ఏడీసీ ప్రసన్న కుమార్, ఎస్‌ఓ కిషోర్ కుమార్, శ్రీసిటీ సెజ్ ఏడీసీ రామ్మోహన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ముప్పాళ్ల శ్రీనివాస్ తన పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలతో పాటు అల్‌స్టామ్, ఎన్‌జీక్ ట్రాన్స్‌మిషన్, వెర్మిరన్ పరిశ్రమలను సందర్శించారు.



విశాఖ సెజ్ జోనల్ డీసీకి జ్ఞాపిక అందిస్తున్న శ్రీసిటీ ఎండీ

పల్లం హాస్టల్‌ను తనిఖీ చేసిన వైద్యబృందం

- వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసిన సాంఘిక సంక్షేమశాఖ
- ఔట్‌సోర్స్ వర్కర్ నియామకం

ఏర్పేడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పల్లం ఎస్సీ హాస్టల్‌లో వసతులు కరువు అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితం అయింది. స్పందించిన జిల్లా అధికారులు పల్లం హాస్టల్‌లో పనిచేస్తున్న వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వాచ్‌మెన్ నుంచి వంట దాక ఒకరే పనిచేస్తున్నారనే దానిపై స్పందించిన అధికారులు ఆవుట్‌సోర్సింగ్ కింద ఓ వ్యక్తిని పల్లం హాస్టల్‌లో పనిచేయడానికి గురు వారం నియమించారు. అలాగే ఏర్పేడు మండల పరిధిలో ఉన్న వైద్య బృందం హాస్టల్‌ను తనిఖీ చేసింది. పాత్రపోయిన కుళాయిలు, అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను, కిటికీలను పరిశీలించి వీటినంత త్వరగా పనులు చేపట్టి శుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్ రవికుమార్‌కు సూచించారు. హాస్టల్‌ను తనిఖీ చేసిన వారిలో మెడికల్ ఆఫీసర్ శివప్రియ, ఎంపీహెచ్ఈవో సుబ్బరామయ్య, వైద్య సిబ్బంది తులసీరామ్, లక్ష్మీ దేవి, ఏఎన్ఎంలు లక్ష్మీ మోహన, ఆశా వర్కర్ ప్రసూన ఉన్నారు.



వంటగదిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

సమాజ మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాజానికి దిశానిర్దేశం చేసే వారు ఉపాధ్యాయులని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన భారతి, వరలక్ష్మి, నాగస్వామి, సురేష్, వీరాస్వామి, కవిత, స్వరూప, మాధవి, బాలకృష్ణ, ధనంజయ, షర్మిల, మునస్వామి, గోవర్ధన్‌లను ఎంఈవోలు, ఎస్టీయూ నాయకులు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, హరిప్రియ, వాణి, ఎస్టీయూ నాయకులు యువశ్రీ మురళి, వెంకటేశ్, సురేష్, శారదమ్మ, లక్ష్మయ్య, జగన్నాధం, గజేంద్ర, కళ్యాణి, శ్రీహరి, సుబ్బారావు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

నారాయణవనం, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రత్యేక దారాలతో అల్లిన పూసలతో పవిత్ర మాలలను సమర్పించారు. ఆలయంలోని దేవతాప్రతిమలకు, కలశాలకు పవిత్రాలను సమర్పించారు. హోమం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నను మాడవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనలతో హారతులు పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





పవిత్రాలు సమర్పిస్తున్న అర్చకులు, మాడవీధులలో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న

జనసేన కార్యాలయానికి స్థలం కేటాయించండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కార్యాలయం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఆ పార్టీ ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కోరారు. గురువారం ఊరందూరులోని ఎమ్మెల్యేను స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. స్థలం కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ షఫీ, గల్లా కిషోర్, సిసింద్రీ, శరత్‌కుమార్, కేశవ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన కోసమే ఉపాధి హామీ చట్టం

బుచ్చినాయుడుకండ్రిగ: పేదరిక నిర్మూలన కోసమే ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండలంలోని పెద్దపాలెడు గ్రామంలో గురువారం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. రైతులు పంట పొలాలను పెంపకం చేసుకోవాలని తెలిపారు. ఏపీవో దేవరి, కార్యదర్శి పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు ప్రభుత్వం అందించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యమున తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలో అంగన్వాడీ ఆధ్వర్యంలో బేటీ బచావో -బేటీ పడావో పై కిశోర బాలికలకు గురువారం అవగాహన కల్పించారు. లింగ వివక్ష, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, విద్య, ఆహారం, ఆరోగ్యం, చట్టాలపై అవగాహన కల్పించారు.

ది తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, తిరుపతి

ప్రధాన కార్యాలయము

107వ వార్షికోత్సవ సర్వ సభ్య మహాజన సభ సమావేశపు నోటీసు

తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, తిరుపతి మహాజనసభ సమావేశము తేది: 06-09-2025 శనివారం ఉదయం 10-00 గం॥లకు బ్యాంకు ప్రధాన కార్యాలయము, తిరుపతి నందు జరుగును. కావున 'A' క్లాసు సభ్యులెల్లరు సమావేశమునకు హాజరు కావలసిందిగా కోరడమైనది.

చర్చనీయాంశములు

01) 2021 - 2022 సం॥, 2022-2023, 2023-2024 మరియు 2024-2025 సం॥ యొక్క ఆడిట్ రిపోర్టులు మరియు వార్షిక నివేదికలను ఆమోదించుట.
02) 2021 - 2022 సం॥, 2022-2023, 2023-2024 మరియు 2024-2025 సం॥ నికర లాభములు పంపిణీ మరియు మెంబర్లకు డివిడెండ్ పంపిణీ రిజర్వు బ్యాంకు వారి అనుమతి మేరకు ఏర్పాటు చేయుట.
03) తేది. 01-09-2021 నుండి 31-08-2025 వరకు కొత్తగా చేరిన సభ్యులను / తొలగించబడిన సభ్యులను ఆమోదించుట.
04) 2022-2023, 2023-2024, 2024-2025 మరియు 2025-2026 సం॥లకు కంకరెంటు ఆడిటర్, స్టాట్యుటరీ ఆడిటర్, ట్యాక్సు ఆడిటర్ల నియామకాలను ఆమోదించుట.
05) బైలా నెం.3, వ్యాపార పరిధి, బైలా నెం.8 అధీకృత మూలధనం మరియు బైలా నెం.22 మహాజన సభ కోరంల సవరణలను ఆమోదించుట.
06) ప్రాతినిధ్య మహాజన సభను ఏర్పాటుకు ఆమోదించుట.
07) నిరర్థక ఆస్తుల (ఎన్.పి.ఏ.) వివరములు సమీక్షించుట.
08) 2025 - 26 సం. వార్షిక బడ్జెట్‌ను ఆమోదించుట.
09) 2021-2022, 2022-2023, 2023-2024 మరియు 2024-2025 సం॥నకు బడ్జెట్ మించిన ఖర్చులను (ఆడిట్ / పరిశోధనలకులోబడి) ఆమోదించుట.
10) బ్యాంకు ఉద్యోగుల యొక్క సర్వీస్ కండిషన్స్, స్టాఫింగ్ ప్యాటర్న్ మరియు జీతభత్యాల స్కేల్‌ను ఆమోదించి రిజిస్ట్రారు వారి అనుమతి కోరుట.
11) సభకు అధ్యక్షత వహించు వారి అనుమతితో ప్రవేశపెట్టబడు ఇతర అంశములు.

సం/- కేతం జయచంద్రా రెడ్డి, చైర్మన్	సం/- ఎ. శివకుమార్ రెడ్డి, B.Com., JDC, మేనేజింగ్ డైరెక్టర్

వై. వాసుదేవ యాదవ్, వైస్ చైర్మన్

డైరెక్టర్లు : ఎం. నారాయణ రెడ్డి, ఎ.సురేష్‌కుమార్ రెడ్డి, పి.నాగి రెడ్డి, జి.వెంకటేష్ రాయల్, ఎన్. అనిల్ రాయల్, ఆర్. బ్రహ్మానంద రెడ్డి, కె. అమర్‌నాథ్ రెడ్డి, ఖాసిం మహమ్మద్, ఎం.చంద్రయ్య, వి.జ్యోతిప్రకాష్.

ప్రొఫెషనల్ డైరెక్టర్లు: టి.వెంకటేష్ రెడ్డి, చార్టర్డ్ అకౌంటెంట్, టి.మునిబాలసుబ్రమణ్యం,(దొరబాబు), అడ్వకేట్

బి.ఓ.యం. మెంబర్లు :ఆర్. బాలాజీ, టి.దాస్, సి.రమేష్ | తేది: 18-08-2025, తిరుపతి